Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 4 మేడ్చల్ మల్కాజ్‌గిరి 28 జనవరి 2024 ఆదివారం పేజీలు : 4

## ప్రజల హక్కులు హరిస్తున్న బీజేపీ: ఖర్గే

న్యూఢిల్లీ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల హక్కులను హరిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విమర్శించారు. వాస్తవాలను దాచేందుకు, ప్రజలను ఏమార్చేందుకు భావోద్వేగాలను రెచ్చగొట్టి ఆడుకుంటోందని దుయ్యబట్టారు. ప్రాథమిక హక్కులకు, సామాజిక న్యాయానికి, రాజకీయ హక్కులకు రాజ్యాంగం హామీ ఇస్తోందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం వీటిపై దాడి చేస్తోందని విమర్శించారు. ఇదిలా ఉండగా.. "దేశంలోని ప్రతి ఒక్కరూ తమకు 'అత్యంత విధేయులు'గా ఉన్నారని నిర్ధారించుకునేందుకు ఆర్ఎసఎస్ ప్రయత్నిస్తోంది. దీనికి సమాధానం ప్రతిఘటనే" అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. కాగా జోడో న్యాయ్ యాత్రకు పశ్చిమ బెంగాల్‌లోనూ అ డ్డంకులు సృష్టిస్తున్నారని ఆ రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ అధిర్ రంజన్ చౌధరి తెలిపారు.

# అన్నదాతకు శుభవార్త

## 'రుణమాఫీ'పై కసరత్తు షురూ...!





హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రజలకు భారీ హామీలు ఇచ్చింది. ముఖ్యంగా రైతులకు చాలా హామీలు ప్రకటించింది. అందులో రైతు రుణ మాఫీ, రైతు భరోసా, రైతు కూలీలకు డబ్బులు ప్రముఖంగా ఉన్నాయి. ఈసారి పాత పద్ధతిలోనే రైతు బంధు జమ చేస్తున్నారు. వానకాలం నుంచి రైతు భరోసా అమలు చేయనున్నారు. ఇప్పటి వరకు ఎకరానికి రూ.10 ఇస్తుండగా.. రైతు భరోసాలో భాగంగా ఎకరానికి రూ. 15 వేలు ఇవ్వనున్నారు. గత బడ్జెట్‌లో రైతుబంధుకు రూ.15070కోట్లు కేటాయించారు. గత సర్కారు 54 ఎకరాల వరకు రైతుబంధు అమలు చేస్తూ వస్తోంది. అయితే కొత్త ప్రభుత్వం రైతు భరోసాకు పరిమితులు విధించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇందుకోసం వ్యవసాయశాఖ అధికారులు గైడ్?లైన్స్ రూపొందించే పనిలో పడ్డారు. ఇదివరకు బీడు భూములు, రియల్ ఎస్టేట్ భూములు, ప్రాజెక్ట్‌ల కింద సేకరించిన భూములకు రైతు బంధు డబ్బులిచ్చారని వార్తలు వచ్చాయి. అలాగే ఎన్ని ఎకరాలున్నా కూడా రైతు బంధు ఇచ్చారు. వ్యాపారులు, సినీ ప్రముఖులకు రైతు బంధు వచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. రైతు భరోసాకు పరిమితులు విధించాలని డిమాండ్ ఎప్పటి నుంచో కొనసాగుతోంది. ఇక రైతు రుణ మాఫీకి సంబంధించి సర్కార్ కసరత్తు చేస్తోంది. రైతు రుణ మాఫీకి రూ. 40 వేల కోట్లు అవసరమని వ్యవసాయ శాఖ అధికారులు ప్రతిపాదన సిద్ధం చేశారు. గత బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.26,831కోట్లు కేటాయింపులు చేశారు. అయితే ఈ సారి అదనంగా మరో రూ.14వేల కోట్ల ప్రతిపాదనలు అధికారులు చేర్చారు. ఇందులో రైతు రుణ మాఫీ నిధులు లేవు. రుణ మాఫీ కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సి ఉంటుంది. రైతు రుణ మాఫీ కటాఫ్ పై కూడా ప్రస్తుతం చర్చ కొనసాగుతోంది. గత సర్కారు చేస్తామని చెప్పిన రూ.లక్ష రుణమాఫీ దాదాపు రూ.22వేల కోట్ల వరకు ఉ ండగా ఇందులో రూ.13వేల కోట్ల వరకే మాఫీ చేసింది. మిగిలిన రుణమాఫీతో పాటు తాజాగా రూ.2లక్షల రుణమాఫీకి నిధుల కేటాయింపుపై అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. రైతు రుణ మాఫీ కోసం ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసే అవకాశం ఉంది. కార్పొరేషన్ ద్వారా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొచ్చి రుణ మాఫీ చేసే అవకాశం ఉంది.



## ధరణి: కలెక్టర్ల మొర..

### మమ్మల్ని బాధ్యులను చేయడం సరికాదు!

హైదరాబాద్: ధరణి పునర్నిర్మాణ కమిటీ సమావేశంలో భాగంగా పలు సమస్యలను జిల్లా కలెక్టర్లు కమిటీ దృష్టికి తీసుకువచ్చినట్టు తెలుస్తోంది. ధరణి విషయంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలకు తమను భాద్యులు చేయవద్దని కమిటీకి మొర పెట్టుకున్నారు. ధరణితో పాటు రెవెన్యూ వ్యవస్థలోని లోపాలకు తమను బాధ్యులను చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కోర్టు పరిధిలోని అంశాలకు తమను బాధ్యులను చేయడం సరికాదంటున్న కలెక్టర్లు ధరణి కమిటీ దృష్టి తీసుకువచ్చారు. తెలంగాణ సెక్రటేరియట్‌లో ధరణి కమిటీ సమావేశం సుదీర్ఘంగా కొనసాగుతోంది. ధరణి వాస్తవ పరిస్థితులను కలెక్టర్లు కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. బుధవారం ధరణి కమిటీ సమావేశంలో రంగారెడ్డి, సిద్దిపేట, వరంగల్, ఖమ్మం , నిజామబాద్ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

## 15 ఎంపీ స్థానాలు లక్ష్యంగా వ్యూహాత్మకంగా అడుగులేస్తున్న టీ కాంగ్రెస్



హైదరాబాద్ : స్పష్టమైన మెజార్టీతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. అదే జోష్ లో పార్లమెంట్ ఎన్నికలకు కూడా వెళ్లబోతోంది.. ఈ క్రమంలోనే పార్లమెంట్ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి పెట్టింది.. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను పార్లమెంటు ఎన్నికల్లో కూడా తీసుకురావాలని.. కాంగ్రెస్ అధిష్టానం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది..

సీఎం రేవంత్ రెడ్డి తో పాటు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క అలాగే ముఖ్య నేతలతో సమావేశమైన కాంగ్రెస్ అధిష్టానం.. పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జిల బలాబలాలు, కుల సమీకరణలు, క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి వంటి వాటిపై చర్చించారు..ఈ క్రమంలోనే కొన్ని పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్చార్జి సైతం అధిష్టానం నియమించింది..


**ఎన్నికలపై కాంగ్రెస్ ఫోకస్..** తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో పటణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉంది.. ఇదే విషయం గత ఎన్నికల్లో స్పష్టమైంది.. అదే ఊపులో 15 ఎంపీ స్థానాలను కచ్చితంగా గెలిచి తీరాలనే టార్గెట్ గా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుంది.. బలమైన నేతలను రంగంలోకి దింపాలని అధిష్టానం భావిస్తుంది.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిర్వహించిన వార్ రూమ్ స్టాటజీనే పార్లమెంట్ ఎన్నికల సమయంలోనూ అనుసరించాలని.. అన్ని అస్త్రాలు సిద్ధం చేసుకుని కథనరంగంలోకి దూకాలని కాంగ్రెస్ భావిస్తోంది..

అందుకోసం పార్టీ కోసం కొందరు నేతలు త్యాగాలు చేయాల్సి వస్తుందని.. టికెట్ రాకపోయినా.. దానికి ప్రత్యామ్నాయంగా మరో పదవి ఇస్తామని ఇప్పటికే నేతలకు అధిష్టానం సంకేతాలు పంపిందట.. గత ఎన్నికల్లో కేవలం మూడు స్థానాల్లో మాత్రమే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు.. ఇప్పుడు వారంతా అసెంబ్లీ ఎన్నికలకు పోటీ చేయడంతో.. ఆ స్థానాల్లో బలమైన నేతలను రంగంలోకి దింపాలని.. 15 ఎంపీ స్థానాలు గెలవడం లక్ష్యంగా అందరూ పనిచేయాలని కాంగ్రెస్ హై కమాండ్ నేతలకు సూచించిందట..టిఆర్ఎస్, బిజెపి అభ్యర్థులకు చెక్ పెట్టేలా వ్యూహరచన చేస్తుంది.. అధికార పార్టీ హోదాలో పార్లమెంట్ ఎన్నికలకు వెళ్తున్న కాంగ్రెస్.. పక్క పార్టీలో నా సంతృప్తి నేతలకు సైతం గాళం వేసేలా చాప కింద నీరులా తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తుందని తెలంగాణ కాంగ్రెస్ లో టాక్ నడుస్తోంది.. ఉత్తర తెలంగాణ దక్షిణ తెలంగాణలో ఎక్కడైతే పార్టీ బలహీనంగా ఉందో.. ఆయా ప్రాంతాలలో ఉన్న బలమైన నేతలని పార్టీలోకి లాక్కోవాలని చూస్తుంది.. విపక్షాలకు చెక్ పెట్టేలా కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులేస్తోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు..



# నిరుద్యోగుల గోస చూడన్నా

## రేవంతుడి వైపు ఆశగా చూస్తున్న నిరుద్యోగ యువత




హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అయితే తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని ఉద్దేశంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావాలని ఉ ద్యమాలలో పాల్గొన్నటువంటి నిరుద్యోగులకు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయి పది సంవత్సరాల పరిపాలనలోఏ ఒక్క నిరుద్యోగి ఉద్యోగం ఇవ్వలేని గత తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయి పది సంవత్సరాలు పరిపాలించినటువంటి మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయితే మన రాష్ట్రంలో ఉన్నటువంటి తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి కుటుంబాలలో ఇంటికో ఉద్యోగం ఇస్తాను అని హామీ ఇచ్చినటువంటి మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మాయ మాటలు నమ్మి తెలంగాణ ప్రభుత్వానికి ఓటు వేసి గెలిపించుకున్నటువంటి టిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలు పరిపాలన చేసినటువంటి తరుణంలో ఏ ఒక్క నిరుద్యోగి ఉద్యోగం ఇప్పించినటువంటి సందర్భం లేదని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయినా తర్వాత మూడవసారి తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినటువంటి సందర్భంలో కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కైనా తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి నిరుద్యోగలు కనిపిస్తున్నారా తెలంగాణ రాష్ట్రంలో లక్షలలో నిరుద్యోగు లు ఉన్నారని వారికి ఏదో ఒక దారి చూపించే బాధ్యత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఉన్నదా మీయొక్క పదవుల కోసమేనా మీ పరిపాలన అని పలువురు నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు పదవుల కోసం లేనిపోని హామీలు ఇచ్చుకుంటూ మీ ఆస్తులను కాపాడుకోవడం కోసమేనా తెలంగాణ రాష్ట్రంలో ఎంతోమం ది నిరుద్యోగులు ఉద్యోగాలు లేకపోవడంతో నిరాశతో జీవితంపై విరక్తి చెందుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయని ఇకనైనా నిరుద్యోగులపై కనికరం చూపించి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పించే విధంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగులకు ఉ ద్యోగాలు ఇప్పించే విధంగా ఒక ప్రణాళిక ప్రవేశపెట్టాలని పలువురు నిరుద్యోగులు కోరుకుంటున్నారు

# సంపాదకీయం

## వైఎస్ షర్మిళ ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పగలరా?

కొన్ని ఊహించని పరిణామాలు, మరికొన్ని ఊహించిన పరిణామాల నడుమ తనను నమ్ముకున్న పార్టీ కార్యకర్తలకు షాకిస్తూ వైఎస్ షర్మిళ "వైఎస్సార్టీపీ"ని మూసేశారు. అంతన్నాడు ఇంతన్నాడే గంగరాజు... అన్నట్లుగా తెలంగాణలో రాజన్న రాజ్యం తెస్తానని పాదయాత్ర కూడా చేసి, తీరా ఎన్నికల సమయానికి అస్త్రసన్యాయం చేశారు. తన ఆట కాంగ్రెస్ పార్టీ ఆడతాదని బ్యాట్ పక్కనపాడేశారు!! ఆనాక కాంగ్రెస్ పార్టీ గెలిచిన తర్వాత.. తాను ఆడకపోవడం వల్లే గెలిచిందని చెప్పుకున్నారు!! కట్ చేస్తే... కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు.. సోనియమ్మను ఆకాశనికెత్తారు.. రాహుల్ ని ప్రధానిని చేయడమే లక్ష్యమని తెలిపారు.. వైఎస్ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ ఏనాడు ఇబ్బందిపెట్టలేదని చెబుతున్నారు.. వైఎస్ బిడ్డగా చెబుతున్నా – వైఎస్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసింది అని భారీ స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఎఫ్.ఐ.ఆర్. లో వైఎస్సార్ పేరు చేర్చడం.. సోనియాకు తెలియకుండా జరిగిన పొరపాటని వెల్లడించారు!! ఈ సమయంలో... తెలంగాణలో రాజన్న రాజ్యం బాధ్యతను రేవంత్ రెడ్డికి అప్పగించారో ఏమో... ఏపీలో వైఎస్సార్ ఆశయాల సాధన తన బాధ్యత అంటూ ఏపీ కాంగ్రెస్ బాధ్యతలు తీసుకున్నారు షర్మిల. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రుల ఆగ్రహం చవిచూసిన కాంగ్రెస్ ఇక్కడ వెంటిలేటర్ పై ఉన్న సంగతి తెలిసిందే. దీంతో... వెంటిలేటర్ పై ఉన్న పార్టీని ఒలెంపిక్స్ లో పరుగుపెట్టిస్తాను అన్న కాన్ ఫిడెన్స్ తో షర్మిళ రంగంలోకి దిగినట్లున్నారు. ఈ సమయంలో వచ్చీరాగానే జగన్ పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఒకసమయంలో... "జగన్ రెడ్డి" అంటూ సంభోదించారు కూడా! దీంతో... మనిషి ఎంత ఎత్తుకెళ్లినా సరే... పునాదులు మరిచిపోకూడదు అనే కామెంట్లు వినిపించాయి. ఈ సందర్భంగా జగన్ పై చేస్తున్న విమర్శలు సంగతి కాసేపు పక్కనపెడితే... వైఎస్ షర్మిళ ఏపీ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన కొన్ని ప్రశ్నలు ఉన్నాయనేది ఇప్పుడు కీలక అంశంగా ఉంది.

**అవి ఈ విధంగా ఉన్నాయి...** అసలు జగన్ తో ఎందుకు విభేదించాల్సి వచ్చింది? వైఎస్సార్టీపీని కాంగ్రెస్ లో ఎందుకు విలీనం చేయాల్సి వచ్చింది? ఏపీ వైపు ఎందుకు అడుగులు వేయాల్సి వచ్చింది? కాంగ్రెస్ ను చెడామడా తిట్టి ఇప్పుడు కీర్తించడాన్ని ఎలా చూడాలి? మిమ్మల్ని ఏపీకి రేవంతి రెడ్డి వ్యూహాత్మకంగా మల్లించాడనే కామెంట్ కు సమాధానం? వైఎస్ ఫ్యామిలీలోని మహిళలంతా ఖైరతాబాద్ సెంటర్ లో రోడ్డు ఫుట్ పాత్ పై అర్ధరాత్రి కూర్చోడానికి కారణం ఎవరు? జగన్ ఏం అన్యాయం చేశారో స్పష్టంగా చెప్పగలరా? ఓదార్పు యాత్ర చేయాలని జగన్ భావించడం నేరమా? మీరు తెలంగాణలో ఉన్నప్పుడు మణిపూర్ అంశంపై ఎందుకు స్పందించలేదు? ఏపీతో మాకేం సంబంధం అన్న మాటలు ఇప్పుడు ఎక్కడికి వెళ్లాయి?

ఇటువంటి ప్రశ్నలన్నింటికీ షర్మిళ ఆత్మసాక్షిగా, దైవ సాక్షిగా వాస్తవ సమధానాలు చెప్పి.. అప్పుడు ఏపీని ఉద్ధరిస్తాననే మాటలు మాట్లాడితే ప్రయోజనం ఉంటుందని.. అప్పటివరకూ ఏ స్థాయిలో కష్టపడినా కలిసొచ్చేది ఏమీ ఉండదని అంటున్నారు!!

# మత్తులో విద్యార్థి చిత్తు..



నిర్మల్ : రాష్ట్రంలో మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాల వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటుచేసి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి కేసీఆర్ కొద్దినెలల క్రితం ప్రకటించారు. దీంతో జిల్లా పరిధిలో పోలీసు, ఆబ్కారీ అధికారులు స్థానికంగా ఉండే రెవెన్యూ, మున్సిపల్ సహకారంతో విస్తృత తనిఖీలు చేపట్టారు. నియంత్రణకు కృషి చేశారు. కొద్దిరోజులు ఆర్భాటంగా ఈ తతంగం కొనసాగినా, ఆ తర్వాత నెమ్మదించింది. క్రమేపీ నిలిచిపోయింది. ఫలితంగా పరిస్థితి మొదటికొచ్చి జిల్లాపరిధిలో మత్తు పదార్థాల వినియోగం పెచ్చుమీరిపోతోంది. తాజాగా చోటుచేసుకుంటున్న ఘటనలు దీనికి నిదర్శనం.

'హద్దు'లు దాటుతూ..

జిల్లాకు పొరుగునే మహారాష్ట్ర ఉండటం, సరిహద్దు ప్రాంతాల్లో పెద్దగా తనిఖీలు, నిఘా లేకపోవడంతోనే యథేచ్ఛగా మత్తుపదార్థాల రవాణా సాగుతోంది. బాసర, తానూరు, కుభీరు, కుంటాల, సారంగాపూర్ తదితర మండలాల్లో పలు గ్రామాల్లో మహారాష్ట్రతో సరిహద్దును కలిగి ఉన్నాయి. భైంసా నుంచి భోకర్ వెళ్లే ప్రధాన రహదారిపై మినహా మరెక్కడా పెద్దగా తనిఖీ కేంద్రాల్లేవు. ఈ కారణంగానే అటువైపు నుంచి జిల్లాకు సులభంగా మత్తుపదార్థాలు చేరవేసేందుకు సౌలభ్యం ఏర్పడింది. ఏదైనా పక్కా సమాచారం వచ్చినపుడో, తనిఖీల్లో పట్టుబడినపుడో మినహా మిగతా సమయంలో పోలీసులు, ఆబ్కారీ అధికారులు పెద్దగా సోదాలు చేసిన దాఖలాలు కనిపించకపోవడం అక్రమ దందాకు ఊతమిచ్చినట్లవుతోంది.

వరుస ఘటనలు..

తాజాగా బాసరలోని ఆర్జీయూకేటీలో ఇద్దరు విద్యార్థులు గంజాయి తాగుతూ పట్టుబడటం గమనార్హం. ఇతర విద్యార్థులకు అనుమానం రావడంతో అధికారులకు సమాచారం అందించారు. నాందేడ్ నుంచి గంజాయి సరఫరా అయి ఉంటుందని ప్రాథమిక విచారణలో స్పష్టమవడం పరిస్థితికి అద్దం పడుతోంది. కొద్దిరోజుల క్రితం ముథోల్ ప్రాంతంలోని ఓ ప్రభుత్వ వసతిగృహంలో పలువురు విద్యార్థులు హుక్కా తాగుతున్నట్లు బయటపడింది. వసతిగృహంలో హుక్కా పరికరం పట్టుబడటంతో దాన్ని స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థులకు అవగాహన కల్పించిన అధికారులు ఆ తర్వాత చేతులు దులుపుకొన్నారు. జరిగిన సంఘటనకు ధ్యులెవరనే విషయమై ఇప్పటికీ స్పష్టత లేకపోవడం గమనార్హం. ఎక్కడ్నుంచి ఇవి సరఫరా అయ్యాయి, ఎవరు తీసుకొచ్చారనే అంశానికీ తగిన ప్రాధాన్యత నివ్వలేదని, ఫలితంగా ఈ అంశం మరుగున పడినట్లయ్యిందని స్థానికులు పేర్కొంటున్నారు.


అలవాటుపడి..

ఒకరిని చూసి మరొకరు మత్తుకు అలవాటుపడుతున్నారు. ముఖ్యంగా విద్యాసంస్థల్లో ఈ పోకడ కొనసాగుతుండటం శోచనీయం. సామాజిక మాధ్యమ వినియోగం పెరిగింది. సమాచార మార్పిడి సులభమైంది. దీనికి తోడు వసతిగృహాలు, విద్యాలయాల్లో పర్యవేక్షణ నామమాత్రమైంది. ఈ కారణంగానే సులభంగా వ్యసనానికి బానిసవుతున్నారు. ఈ క్రమంలో చదువును, తమ భవిష్యత్తును చేజేతులా దెబ్బతీసుకుంటున్నారు.

చర్యల్లేకనే..

మత్తు పదార్థాల నియంత్రణకు మొదట్లో అధికారులు కఠినంగా వ్యవహరించారు. ఎక్కడికక్కడ తనిఖీలు విస్తృతంగా చేపట్టారు. పట్టుబడ్డవారిపై కేసులు నమోదుచేశారు. పీడీ యాక్టు నమోదుకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఇదంతా కొద్దిరోజులే.. ఆ తర్వాత నెమ్మదించారు. అవగాహన చర్యలను పట్టించుకోవడం లేదు. ఫలితంగా పరిస్థితులు మళ్లీ మొదటికొచ్చాయి. ఇష్టారీతిన గంజాయి, హుక్కా వంటి మత్తుపదార్థాల వినియోగం పెరిగిపోయింది.

# ఇక కార్డులేకున్నా ఆరోగ్యశ్రీ సేవలు



నిర్మల్ : తెల్లరేషన్ కార్డుగానీ, ఆరోగ్యశ్రీ కార్డుగానీ కలిగి ఉన్న వారికే ఇది వరకు కార్పొరేట్ ఆసుపత్రి సేవలు అందుబాటులో ఉండేవి. తాజాగా ఆహార భద్రత కార్డులు కలిగిన ప్రతి కుటుంబానికి ఆరోగ్యశ్రీ సేవలను వర్తింపజేస్తూ తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులతో ఉమ్మడి జిల్లాలోని పేదలకు అందుబాటులోని లేని ఖరీదైన వైద్యం చేరువ కానుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి పేదలకు ఏ పెద్ద జబ్బు వచ్చినా.. మరే చికిత్స చేసుకున్నా ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా పొందేలా ఆరోగ్యశ్రీ సేవలకు శ్రీకారం చుట్టారు. అప్పట్లో తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఆరోగ్యశ్రీ సేవలు వర్తించేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం చికిత్సకు రూ. 5 లక్షల వరకు ప్రభుత్వమే భరించేలా ఆ పథకాన్ని అమలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత కూడా ఆరోగ్యశ్రీ సేవలు యథాతదంగా అమలవుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుల స్థానంలో ఆహార భద్రత కార్డులను జారీచేసింది. గతంలో తెల్లరేషన్‌కార్డు లేని వారందరికీ ఆహార భద్రత కార్డులను పంపిణీ చేసింది. కొత్తగా ఆహార భద్రత కార్డులు పొందిన వారికి ఆరోగ్యశ్రీ సేవలు పొందేందుకు పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేది. ఆ సేవలు పొందాలంటే తహసీల్దారు, లేదంటే పాలనాధికారి కార్యాలయానికి వెళ్లి అనుమతి పత్రం తీసుకోవాల్సిన పరిస్థితి. దీంతో పేదలు ఎన్నో అగచాట్లు పడ్డారు. ఇపుడా పరిస్థితిని దూరం చేస్తూ ఆరోగ్యశ్రీసేవలను ఆహారభద్రత కార్డులకు వర్తింపజేయడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలాది మంది పేద కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది.

1,660 రకాల చికిత్సలు

డా. వినీత్, ఉమ్మడి జిల్లా సమన్వయకర్త, ఆరోగ్యశ్రీ విభాగం

గతంలో తెల్లరేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు ఉంటేనే ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉండేవి. ఇపుడు ఆహార భద్రత కార్డుదారులు సైతం ఆయుష్మాన్ భారత్ – ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చు. తెలంగాణలోనే కాదు మహారాష్ట్రలోనూ ఆయుష్మాన్ భారత్ కింద ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చు. ఆరోగ్యశ్రీ కింద 1,660 రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఏదైనా ఆసుపత్రికి వెళ్లినపుడు ఆహార భద్రతకార్డు తీసుకెళ్తే చాలు సేవలు వినియోగించుకోవచ్చు.

# చరవాణి భద్రం

ఖమ్మం : 5 నెలల క్రితం ఖమ్మంలో ఓ దొంగను పోలీసులు అరెస్టు చేసి పదికిపైగా చరవాణిలను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో సమాచారం ఆధారంగా బాధితులకు అప్పగించారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వచ్చిన బస్సులో ఎవరో ప్రయాణికుడు మరిచిపోయిన విలువైన చరవాణి, ఇతర గుర్తింపు కార్డులను ఖమ్మం ఆర్టీసీ అధికారులు చూసి డిపోలో భద్రపరిచారు. కార్డుల ఆధారంగా బాధితుడికి సమాచారం ఇచ్చి చరవాణి, ఇతర వస్తువులను అప్పగించారు. అదృష్టవశాత్తు సంస్థ ఉద్యోగులు చూడటంతో తన చేతికి వచ్చింది. రద్దీసమయంలో తస్కరణకు గురైన ఎన్నో ఫోన్ల ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. దైనందిన జీవితంలో చరవాణి ఓ భాగమైంది. నేటి సాంకేతిక యుగంలో అది లేకుండా ఇంటి నుంచి బయటకు రావడం ఊహించలేనంతగా మారిపోయింది. సమాచార విప్లవంలో కనీస అవసరమైపోయింది. కొత్తకొత్త ఫీచర్‌లు సొంతం చేసుకున్న స్మార్ట్‌ఫోన్‌ల కోసం జనం వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. వాటిని ప్రాణప్రదంగాను చూసుకుంటున్నారు. అందులోనే సమస్త సమాచారం నిక్షిప్తం చేసుకుంటున్నారు. కానీ దురదృష్టవశాత్తు, ఏమరుపాటులో వాటిని పోగొట్టుకుని బాధపడుతున్నారు. మరికొందరి ఫోన్లు చోరీకి గురవుతున్నాయి. కొందరు పోగొట్టుకున్న, తస్కసరణకు గురైన తమ ఫోన్లను తిరిగి పొందేందుకు ప్రయాస పడుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులకు ఫిర్యాదు చేయడం, జాగ్రత్తలపై కథనం.

పోయినవి 300.. ఛేదించినవి 89

సైబర్ ల్యాబ్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు మొత్తం 300 ఫోన్లు పోగొట్టుకున్నట్లు బాధితుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. అనధికారికంగా పోలీస్‌స్టేషన్‌కు చేరని సంఘటనలు ఇంకా చాలానే ఉంటాయి. అందులో చోరీకి గురైనవి, తమ అజాగ్రత్త వల్ల పోయినవి ఉన్నాయి. సైబర్ విభాగం ఎంతో సమయం వెచ్చించి ఇప్పటివరకు 89 చరవాణులను గుర్తించి వాటిని బాధితులకు అందించారు. పోలీసు శాఖలోని సాంకేతిక విభాగం, సర్వీసు ప్రొవైడర్ల సమన్వయంతో నెలల తరబడి వెచ్చిస్తేగాని చోరీకి గురైన ఫోన్ల ఆచూకీ గుర్తించడం కష్టమని పోలీసులు చెబుతున్నారు.

మీ సేవలోనూ ఫిర్యాదు చేయొచ్చు

పోలీసు కమిషనరేట్ పరిధిలో సెల్‌ఫోన్లు చోరీకి గురవుతున్నా ఫిర్యాదులను స్వీకరించేందుకు కొన్ని పోలీసు స్టేషన్లు విముఖత చూపుతున్నట్లు తెలిసింది. దీంతో బాధితులు మీసేవ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశాన్ని పోలీసు శాఖ కల్పించింది. అలా చేసినప్పటికీ చరవాణి గురించి స్టేషన్లలో ఆరా తీసేందుకు వెళితే సరైన సమాధానం చెప్పడం లేదు. సైబర్‌సెల్‌కు పంపించాం. గుర్తించినప్పుడు ఇస్తాం అనే నిర్లక్ష్య సమాధానాలే ఎక్కువగా వినిపిస్తున్నాయనే ఆరోపణలు సైతం ఉన్నాయి.

స్వీయ జాగ్రత్తలే ప్రధానం..ఖరీదైన చరవాణిలను చోరీ చేసి సొమ్ము చేసుకోవడం అలవాటుగా మారిన కొందరు దొంగలు బస్టాండు, రైల్వేస్టేషన్, దుకాణాలు, ఆటో స్టాండ్ల వద్ద యథేచ్ఛగా తిరుగుతున్నారు. ప్రయాణికులు గుంపులుగా ఉన్నపుడు, రద్దీ ప్రాంతాల్లో తమ నైపుణ్యం ప్రదర్శిస్తున్నారు. ఎలాంటి ఫోన్ అయినా ఫర్వాలేదనట్లు చోరాహుషార్ చూపిస్తున్నారు. ప్రజలు విలువైన సెల్‌ఫోన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటిని పోగొట్టుకుంటే తిరిగి పొందడం కష్టమైన పని అని చెబుతున్నారు పోలీసులు.

ఎక్కడో కొట్టేసి.. అమ్మకాలు

సెల్‌ఫోన్ చోరీకి గురైనా, పోగొట్టుకున్నా కనిపెట్టడం పోలీసులకూ కష్టంగా మారింది. ఆ ఫోన్‌లో వెంటనే సిమ్‌కార్డు వేస్తే గుర్తించే అవకాశం ఉంది. అలా కాకుండా సిమ్‌కార్డు తీసేసి ఫోన్ స్విచ్ఛాఫ్ చేస్తున్నారు. ఐఎంఈఐ నంబరును బట్టి పోలీసులు శోధించినా ఫలితం ఉండటం లేదు. ఫోన్ దొంగల చేతికి వచ్చిన వెంటనే సిమ్ తీసేసి సుమారు 4 నెలల వరకు స్విచ్ఛాఫ్‌గానే ఉంచుతున్నారు. ఇలా దోచుకున్న ఫోన్లను చిల్లరదొంగలు బయట తెలిసిన వారికి రూ. 2 వేల నుంచి రూ. 5వేల వరకు తీసుకొని అంటగడుతున్నారు. అది ఎంత ఖరీదైనా ఫోను అయినప్పటికీ ఇలా చేస్తున్నారు.

## కష్టపడి ఇష్టపడి చదివే విద్యార్థులకు వెన్నుదన్నుగా ఉండటం ఎంతో అవసరం

శామీర్ పేట, (గరుడ వార్త) : కష్టపడి ఇష్టపడి చదివే విద్యార్థులకు వెన్ను దండుగా ఉండడం ఎంత అవసరమని తద్వారా విద్యార్థులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని శామీర్ పేట మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్ అన్నారు. శనివారం తూముకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నందున వారికి స్నాక్స్ పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి బాగా శ్రమించి చదువుకుంటే భవిష్యత్తులో మంచి ఫలితాలను సాధిస్తారని తెలిపారు.



బాగా చదివి అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. 10వ తరగతి పరీక్షలు పూర్తయ్యే వరకు ప్రతిరోజు సాయంత్రం వేళలో విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు చంద్రశేఖర్ యాదవ్ కు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేసి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు వెంకటేశం, పాఠశాల ఉపాధ్యాయులు తిరుమలేష, నాగ శారద, అన్నపూర్ణ, అమీనా, వనజ, వరలక్ష్మి, శ్రీదేవి, మంజుల, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## రైతు వ్యతిరేక విధానాలు కేంద్ర ప్రభుత్వం వీడాలి

శామీర్ పేట, (గరుడ వార్త) : రైతు వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విడనాడాలని రైతు సంఘం ఉపాధ్యక్షుడు డి జి సాయిలు గౌడ్, జిల్లా అధ్యక్షుడు నిమ్మల నర్సింలు డిమాండ్ చేశారు. శనివారం శామీర్ పేట మండల కార్యాలయ సముదాయంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చేనెల 16న గ్రామీణ బంధు, సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా అవలంబిస్తున్న విధానాలను వెంటనే వీడాలన్నారు. వచ్చేనెల జరిగే గ్రామీణ బంధు, సమ్మెకు రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మిక సంఘాలు, మిగతా



పారిశ్రామిక సంఘాలు, అసంఘటిత కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం గీతా పనివారాల సంఘం 2024 నూతన క్యాలెండర్ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాములు గౌడ్, ఏఐకేఎస్ జిల్లా కోశాధికారి చంద్రయ్య, సహాయ కార్యదర్శి జంగయ్య, నాయకులు చైతన్య, భూమయ్య, వెంకటేష్, సురేష్ పాల్గొన్నారు.

## నాటడం ముగిసింది.. సంరక్షణ మిగిలింది

సారంగాపూర్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న హరితహారం లక్ష్యం ఏటా పూర్తి చేస్తున్నప్పటికీ మొక్కలు పూర్తి స్థాయిలో కనపడడంలేదు. ఈ ఏడాది జిల్లా లక్ష్యం 40 లక్షలు కాగా నాటడం పూర్తి చేసినప్పటికీ, మొక్కల సంరక్షణలో ఏటా విఫలమవుతూనే ఉన్నారు. కేవలం లక్ష్యం కోసం కాకుండా నాటిన ప్రతి మొక్కను కాపాడుకున్నప్పుడే హరితలక్ష్యం నెరవేరనుంది. జిల్లాలో డీఆర్డీఏ ద్వారా 30 లక్షలు కాగా మిగతా ఇతర శాఖల ద్వారా మరో 10 లక్షల మొక్కలను నాటేందుకు లక్ష్యాన్ని నిర్దేశించారు. కేవలం డీఆర్డీఏ, అటవీ, ఉద్యానవన శాఖ మినహా ఇతర శాఖల లక్ష్యం పూర్తి చేయలేకపోయారు. కొన్ని శాఖలకు వందల్లో లక్ష్యం నిర్దేశించినా నాటడంలో నిర్లక్ష్యం చేశారు. అటవీ శాఖ లక్ష్యం కేవలం 25 వేలు కాగా 5 లక్షల మొక్కలు నాటడం విశేషం. కాగా ఇంటింటికీ సెర్ప్ ద్వారా 5 లక్షల మొక్కలను పంపిణీ చేశారు. కొన్ని మండలాల్లో లక్ష్యానికి మించి మొక్కలను నాటగా మిగతా మండలాల్లో లక్ష్యాన్ని చేరుకోవాల్సి ఉంది. అయితే లక్ష్యం పూర్తి చేసినప్పటికీ నర్సరీల్లో మొక్కలు చాలా వరకు అలాగే ఉండిపోయాయి.

ఇంటింటికీ లెక్కలు.. వృథాగా మొక్కలు

ప్రతి ఇంటికి అయిదు చొప్పున మొక్కలను సరఫరా చేస్తున్నారు. ఎనిమిది విడతలుగా ఒక్కో ఇంటికి 40 మొక్కల చొప్పున అందించారు. ఇందులో ఒక్కో ఇంట్లో నాలుగు మొక్కలు కూడా కనిపించనివి చాలా ఉన్నాయి. అంతేకాకుండా మొక్కలు కేవలం లక్ష్యం కోసం ఇంటింటికీ అందిస్తున్నారే తప్పా.. వారికి అవసరమైనవి అందించకపోవడంతో తీసుకున్న వెంటనే పక్కన పడేస్తున్నారు. కొందరు ఇంటి ఆవరణలో స్థలం లేనప్పటికీ మొక్కలు అందించడంతో వృథా అవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇళ్లలో నాటే పండ్లు, పూలవి కాకుండా ఇతర మొక్కలు అందించడం ద్వారా పక్కన పడేస్తుండడం గమనిస్తూనే ఉన్నారు. అయినప్పటికీ మొక్కలను ఏటా అందించడం.. ఆ తరువాత పడేయడం పరిపాటిగా మారింది. గతంలోనే ఇంటి యజమానులకు అవసరమైన మొక్కలను అందించాలని గతంలో అధికారుల పేర్కొన్నప్పటికీ అందించడంలేదన్న విమర్శలు ఉన్నాయి.

అటవీశాఖ సఫలం

అటవీశాఖ ఆధ్వర్యంలో నాటుతున్న మొక్కలు ఏపుగా ఎదుగుతూ సత్ఫలితాలిస్తున్నాయి. డీఆర్డీఏ ఉపాధి హామీ పథకం ద్వారా బ్లాక్ ప్లాంటేషన్లు ఏర్పాటు చేస్తున్నా మొక్కల ఎదుగుదల లేకపోవడమే కాకుండా కనిపించడంలేదు. ఇందుకు ప్రధానంగా గుంతలు తీయడం, నాటేందుకు తీసుకెళ్లిన మొక్కలను నాటకుండానే పడేయడం, భూమి చదును చేసి నాటే పద్ధతిలో కూడా తేడా ఉంటుంది. అటవీ శాఖ ద్వారా నాటుతున్న మొక్కలు కనీసం నీరు కూడా అందించకుండా ఎదుగుతుండగా, ఉపాధి హామీ ద్వారా వేసవిలో నీరు అందిస్తున్నా సగానికి పైగా మొక్కలు ఎండిపోతున్నాయి. రెండు శాఖల మధ్య మొక్కల ఎదుగుదల వ్యత్యాసాన్ని గమనించి అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

వ్యయం అధికం..

నర్సరీల్లో పాలిథిన్ కవర్లలో మట్టినింపి విత్తనాలు నాటి మొక్కలు సిద్ధం చేయడం నుంచి నాటడం వరకు ఒక ఎత్తయితే.. వాటిని నాటిన తరువాత సంరక్షణలో నిర్లక్ష్యం చేస్తున్నారు. దీనివల్ల ఒక్కో మొక్క నాటడానికి, పాదులు తీయడానికి రూ. 22 చెల్లిస్తుండగా, వాటికి ఏర్పాటు చేసే రక్షణ కంచెలకు రూ. 6 అందజేస్తున్నారు. నీరు పోసేందుకు రూ. 5 అదనంగా చెల్లిస్తున్నారు. ఇంత వ్యయం చేసినా మొక్క బతికించుకోకుంటే నిధులు వృథా అవుతున్నాయి. హరితహారంలో నిబంధనల ప్రకారం నాటిన మొక్క ఎండిపోతే దాని స్థానంలో మరొకటి నాటించాలి.

# దశాబ్దం దాటినా.. పిల్లర్లకే పరిమితం

ధారూర్: ధారూర్ మండల పరిషత్ కార్యాలయంలో దశాబ్దానికిపైగా మండల సర్వసభ్య సమావేశ మందిరం అసంపూర్తిగా ఉండటంతో అటు ప్రజా ప్రతినిధులకు, ఇటు అధికారులకు ఇబ్బందులు తప్పడంలేదు. గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజా ప్రతినిధులు అందరూ కలిసి ప్రతి మూడు మాసాలకోసారి మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసుకుంటారు. ధారూర్ మండల పరిధిలో మొత్తం 32 గ్రామ పంచాయతీలు, 16 అనుబంధ గ్రామాలు, 12 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. సమావేశానికి నేతలతోపాటు వివిధ శాఖలకు చెందిన జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరు కావడానికి సరైన స్థలం లేక నానా అగచాట్లు పడుతున్నారు. సమస్యను గుర్తించిన అధికారులు 11 సంవత్సరాల క్రితం జిల్లా పరిషత్ నుంచి రూ.9 లక్షలు సమావేశ మందిరం నిర్మాణం కోసం మంజూరు చేశారు. అప్పట్లో పనులు చేపట్టిన గుత్తేదారు పిల్లర్ల



వరకు పూర్తిచేసి వదిలేశారు. తరువాత దాని గురించి పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. అప్పటి నుంచి వర్షాలకు తడుస్తూ ఎండకు ఎండుతూ పూర్తికాక ముందే శిథిలావస్థకు చేరింది. సమావేశాలు నిర్వహించాలంటే సరిపడా మందిరం లేక మండల పరిషత్ కార్యాలం లోని ఓ గదిలో ఏర్పాటు చేస్తున్నారు. అందులో అందరూ కూర్చునే స్థలం లేక పక్క వరండాలో కుర్చీలు వేసుకొని కూర్చుంటున్నారు. ఇప్పటికైనా భవనం పూర్తిచేసే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# అప్పుడు ప్రారంభించి.. ఇప్పటికీ అలాగే వదిలి

హుజూర్‌నగర్ : నకిరేకల్ పురపాలిక పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. 2021 నుంచి 2023 మధ్యకాలంలో పురపాలిక పరిధిలో దాదాపు రూ.73.83 కోట్లతో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. రూ.32 కోట్లతో వంద పడకల వైద్యశాల భవనాల నిర్మాణం, రూ.32.94 కోట్లతో ప్రధాన రహదారి విస్తరణ, సుందరీకరణ, మార్కెట్ రహదారిని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయడం, రూ.5.39 కోట్లతో కాలంవారి కుంటను ఆధునీకీకరించడం, రూ.1.50 కోట్లతో రెండు వైకుంఠధామాలు, రూ.2 కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మాణం వంటివి ఉన్నాయి. ప్రస్తుతం వంద పడకల గదుల ఆసుపత్రి పనులు మాత్రమే వేగంగా కొనసాగుతున్నాయి. మిగిలిన వాటిల్లో కొన్ని నత్తనకడకన, మరికొన్ని అసంపూర్తిగా మిగిలాయి. పనుల్లో సింహభాగం టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టినవే ఉన్నాయి.

పూర్తి కాని సమీకృత మార్కెట్

నకిరేకల్ మూసీరోడ్డు వెంట రూ.2 కోట్లతో సమీకృత (వెజ్, నాజ్‌వెజ్) మార్కెట్ నిర్మాణానికి 2021 జూన్ 15న అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దీని స్థలం ఎంపికలో జాప్యం జరిగింది. మండల పరిషత్ కాంప్లెక్స్‌లోని ఆరు ప్రభుత్వ కార్యాలయాల భవనాలను తొలగించి ఆ స్థలంలో మార్కెట్ నిర్మాణ పనులను 2022 జూన్ 26న ప్రారంభించారు. నాడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిర్మాణ పనులు నేటికి పూర్తికాలేదు.

పునాదుల దశల్లోనే వైకుంఠధామాలు

పురపాలిక పరిధిలోని ఎర్రకుంట వద్ద రూ.కోటితో వైకుంఠధామాన్ని నిర్మించే పనులను 2022 డిసెంబరులో మొదలు పెట్టారు. ఏడాదిలో పూర్తి కావాల్సిన నిర్మాణ పనులు ఇప్పటికీ ప్రారంభ దశను దాటడం లేదు. స్నానాల, విశ్రాంతి గదులు, నీటి వసతి, ప్లాట్‌ఫారాల నిర్మాణ పనులు చేపట్టలేదు. కొద్దిమేరలో సీసీ రహదారి నిర్మించి వదిలేశారన్న



ఆరోపణలున్నాయి. చీమలగడ్డ వద్ద రూ.50 లక్షలతో చేపట్టిన వైకుంఠధామం అభివృద్ధి పనులు కూడా పునాది దశను దాటడం లేదు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయించేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆగిన కాలంవారి కుంట ఆధునికీకరణ

మార్కెట్ వెంట ఉన్న కాలం వారి కుంటను బతుకమ్మ కుంటగా అభివృద్ధి చేయాలని మొదటి విడత రూ.75 లక్షలు, రెండో విడతగా రూ.4.64 కోట్లు మంజూరు చేశారు. ఇప్పటి వరకు కట్టను పటిష్ఠం చేసే పనులు మాత్రమే చేపట్టారు. వాకింగ్ ట్రాక్‌లు, యోగాషెడ్డు, గ్రిల్స్, సుందరీకరణ వంటి పనులు చేపట్టలేదు. నిధులు మంజూరైనా రెండో విడత పనులు మాత్రం మొదలు కావడం లేదు.

పనుల తీరుపై ప్రత్యేక సమీక్ష

ఎన్.బాలాజీ, కమిషనర్, పురపాలక సంఘం, నకిరేకల్

పురపాలికలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో జాప్యంపై ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం ఉన్నతాధికారులు ప్రత్యేకంగా సమీక్ష నిర్వహిస్తున్నారు. వేగం పెంచి పూర్తి చేయించేందుకు చర్యలు చేపడతాం.

# ఆదుకునేది ఆధునికీకరణే!



సిరిసిల్ల: సిరిసిల్లకు చెందిన హరిప్రసాద్ మరమగ్గంపైనేసిన వస్త్రాన్ని అయోధ్యలోని సీతారాములకు కానుకగా పంపారు. అతనే అంతకు ముందు వస్త్రంపై జీ20 లోగోను నేసి ప్రధాని మోదీ దృష్టిని ఆకర్షించాడు. మరో నేతన్న నల్ల విజయ్ సూక్ష్మకళతో వస్త్రాలు నేయడంలో అంతర్జాతీయ ఖ్యాతిని పొందుతున్నాడు. జిల్లాలో ముప్పైవేలకు పైగా మరమగ్గాలు.. వేలాది మంది కార్మికులు.. నిత్యం లక్షలాది మీటర్ల వస్త్రోత్పత్తుల్లో ఇలా ఒకటో రెండో ఆవిష్కరణలకు పరిమితమవుతున్నాయి. ముతక రకం ఉత్పత్తులకే పరిమితమవడం.. ఆ ఉత్పత్తులకు కూడా జిల్లాలో సరైన మార్కెటింగ్ సౌకర్యంలేక ఏడాదిలో రెండు, మూడు నెలలు సంక్షోభంలో కొట్టుమిట్టాడడం ఇక్కడి పరిశ్రమలకు సర్వసాధారణమైంది. వస్త్రోత్పత్తులు అంటేనే జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా పోటీ రకాలను తీసుకురావాలి. దశాబ్దాలుగా పురాతన మరమగ్గాలతోనే కాలం వెళ్లదీస్తున్న జిల్లా పరిశ్రమలో ఆధునికీకరణ ప్రక్రియలేవీ కార్యరూపం దాల్చడంలేదు.

జిల్లా పరిశ్రమలోని మరమగ్గాల ఆధునికీకరణకు గతేడాది అక్టోబరులో రాష్ట్ర చేనేత, జౌళీశాఖ వస్త్రోత్పత్తిదారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. ముప్పైవేలకు పైగా మరమగ్గాలున్న పరిశ్రమలో కేవలం ఎనిమిది మంది ఆధునీకరణకు ముందుకు రావడం విశేషం. అందులోనూ ప్రాసెసింగ్ యూనిట్, పాత మగ్గాల నుంచి ఎయిర్‌జెట్‌కు అప్‌గ్రేడ్ చేసుకోవడం, రాపియర్ మగ్గాలు, ఆధునిక డైయింగ్ యూనిట్, గార్మెంటరీ ఉత్పత్తులకు ఇలా మొత్తం రూ.52 కోట్లకు దరఖాస్తు చేసుకున్నారు. ఇక టెక్స్‌టైల్ పార్కులోని మరమగ్గాల ఆధునికీకరణకు ప్రభుత్వం టీ-ట్యాప్ (తెలంగాణ టెక్స్‌టైల్ అపారల్ పాలసీ)ని తీసుకొచ్చింది. దీనిపై యజమానులకు అవగాహన కల్పించడంతో సుమారు 20 మంది యజమానులు ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం మారడంతో ప్రస్తుతం ఇవన్నీ ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. వస్త్రోత్పత్తుల్లో ఎప్పటికప్పుడు కొత్తరకం రావాలంటే ఆధునికీకరణతోనే సాధ్యమవుతుంది. దీనిపై పరిశ్రమ వర్గాలు, అధికారులు దృష్టిసారించాలి.

నాలుగేళ్లుగా ఒక్క పథకమూ లేదు

జిల్లా వస్త్ర పరిశ్రమను 2017-20 వరకు కేంద్ర ప్రభుత్వం పవర్‌టెక్స్ ఇండియా పథకంలో గుర్తింపునిచ్చింది. ఆ సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నూరుశాతం రాయితీతో మరమగ్గాల ఆధునికీకరణకు ప్రణాళికలు చేశాయి. అందులో పదిహేను వేల మరమగ్గాల ఆధునికీకరణకు యజమానులు ముందుకొచ్చారు. పట్టణంలోనే వివిధ కంపెనీలను తీసుకొచ్చి ఎక్స్‌పో నిర్వహించారు. ఆయా కంపెనీలు ఇచ్చిన కొటేషన్లను పరిశీలించి చివరికి ఒక్కో మరమగ్గానికి గరిష్ఠంగా రూ.40 వేలు ఖర్చు చేసేందుకు నిర్ణయించారు. అందులోనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం చెల్లించేలా ప్రణాళికలు చేశారు. దీనికోసం అప్పటి ప్రభుత్వం రూ.30 కోట్ల నిధులను విడుదల చేసింది. వీటిలో పది వేల మరమగ్గాల వరకు డాబీలు, ఆటోమెటిక్ నియంత్ర యంత్రాలను అమర్చుకున్నారు. గడువు ముగియడంతో కేంద్రం పవర్‌టెక్స్ ఇండియా పథకాన్ని పొడగించలేదు. అప్పటి నుంచి వస్త్ర పరిశ్రమలో ఆధునికీకరణ అన్న ఊసేలేదు.

ఉన్నతాధికారుల పరిశీలనలో ఉందిజిల్లాలో మరమగ్గాల ఆధునికీకరణ అంశం ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పరిశ్రమలోనూ మార్పు రావాలి. జిల్లా స్థాయిలో రాష్ట్రస్థాయి అధికారులు, పరిశ్రమవర్గాలతో సమీక్ష నిర్వహించి దాని ప్రాధాన్యత ఆధారంగా ప్రణాళికలు రూపొందిస్తాం. అశోక్, ప్రాంతీయ సహాయ సంచాలకులు, చేనేత, జౌళీశాఖ

# దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి



కరీంనగర్ : వ్యాపార, వాణిజ్య సంస్థలకు వర్తక లైసెన్స్ తప్పనిసరి. ఆస్తిపన్ను తరహాలోనే దుకాణాలకు కొంత మొత్తం ఫీజు చెల్లించి వ్యాపార అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కరీంనగర్‌లో ఎక్కడ చూసినా రెస్టారెంట్లు, హోటళ్లు, కిరాణా దుకాణాలు, వాహన, టీవీలు, మొబైల్ షోరూంలు, మెడికల్ షాపులు, ఆన్‌లైన్ సెంటర్లు, వస్త్ర దుకాణాలు, కల్యాణ మండపాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, పెట్రోల్ బంకులు, మాల్స్ వంటి వాణిజ్య సంస్థలు భారీ సంఖ్యలో ఉన్నాయి. మూడేళ్లుగా వీటి సంఖ్య పెరగగా బల్దియాకు మాత్రం ఆశించిన స్థాయిలో ట్రేడ్ లైసెన్స్‌లు మాత్రం రావడం లేదు. వర్తక లైసెన్స్ కావాలని వచ్చే వారు తప్ప మిగతా దుకాణాదారులు రాకపోవడంతో నగరపాలికనే రంగంలోకి దిగింది. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో ఆన్‌లైన్‌లో నమోదైన దుకాణాలు 6,371 ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.62.34 లక్షలు వసూలయ్యాయి. ఇంకా 2,359 దుకాణాల నుంచి రూ.1.06 కోట్ల ఆదాయం రావాల్సి ఉంది.పునరుద్ధరించకపోతే జరిమానా ఆస్తిపన్ను మాదిరిగానే ఏటా దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించకపోతే జరిమానా తప్పేలా లేదు. ఏప్రిల్ నుంచి మార్చి 31 వరకు ఆర్థిక సంవత్సరం ఉంటుండగా ఆ మధ్యలో చెల్లించే వారికి ఎలాంటి జరిమానా ఉండదు. ఆ తర్వాత పునరుద్ధరించినా, ఇప్పుడే లైసెన్స్ కోసం దరఖాస్తు చేస్తే 25 శాతం జరిమానాతో పాటు హరిత పన్ను విధిస్తున్నారు. రూ.5 వేల లోపు ఫీజు చెల్లించే వారికి 10 శాతం పన్ను మదింపు చేస్తున్నారు. లైసెన్స్ లేకపోతే బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకోవడం సాధ్యం కాదు. వ్యాపారాభివృద్ధికి ఇది తప్పనిసరిగా మారిందనే విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలి.

పది బృందాలతో..నగరవ్యాప్తంగా సుమారు 12 వేలకు పైగా వాణిజ్య, వ్యాపార సంస్థలుండగా అందులో సగం మేర వర్తక లైసెన్స్ తీసుకోవడం లేదు. ఏటా తీసుకునే వారు మినహాయిస్తే కొత్త వారు ఆసక్తి చూపకపోవడంతో బల్దియాకు ఆదాయం రాకుండా పోతోంది. ఆసుపత్రులలో కొందరు యజమానులు కోర్టు ద్వారా స్టే తీసుకురాగా మరికొందరు అవసరాల కోసం ముందుకొస్తున్నారు. ప్రతి వ్యాపార సంస్థను ట్రేడ్ లైసెన్స్ పరిధిలోకి తీసుకు రావడానికి నగరపాలక అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మొత్తం పది టీంలతో సర్వే చేస్తూ నిర్ణీత లక్ష్యాన్ని సాధించేలా చర్యలు చేపట్టారు. మార్చి 31లోగా పెండింగ్‌లో ఉన్న మొత్తంతో పాటు కొత్త దుకాణాలను నమోదు చేయనున్నారు.

ఆన్‌లైన్ ద్వారా వెంటనే జారీ

జి.స్వరూపరాణి, డిప్యూటీ కమిషనర్, నగరపాలిక

ప్రతీ వ్యాపార, వాణిజ్య సంస్థకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి. ఫీజు వసూలు చేసేందుకు టీంలు తిరుగుతున్నాయి. వీటిని తిరిగి రెన్యూవల్ చేసుకొని సహకరించాలి. అప్పటికప్పుడే ఆన్‌లైన్ ద్వారా లైసెన్స్ జారీ చేస్తారు.

# క్షయ ముదురుతోంది

సూర్యాపేట: క్షయ వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తోంది. వాతావరణంలో మార్పులు, ఇతర కారణాలతో వ్యాధి పీడితులు క్రమంగా పెరుగుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రణ చర్యలు చేపడుతున్నప్పటికీ మహమ్మారి అంతం కావడం లేదు. జనాల్లో అవగాహన కొరవడటంతో ఇతరులకు వ్యాప్తి చెందుతోంది. నిర్లక్ష్యం చేసిన వారిలో వ్యాధి ముదిరి ప్రాణాలు తీస్తోంది. గత రెండేళ్లలో సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో 10,032 మంది క్షయ బారిన పడగా.. 7133 మందికి నయమైంది. 221 మందికి వ్యాధి ముదిరింది. రెండేళ్లలో 237 మంది క్షయతో మృతిచెందడం ఆ వ్యాధి తీవ్రతను తెలుపుతోంది.నియంత్రణకు ముమ్మర చర్యలు

క్షయ బారిన పడిన వారికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన చికిత్స అందిస్తున్నారు. ప్రతినెలా ఆశా కార్యకర్తల ద్వారా రోగులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలో గ్రామాల్లో సర్వే చేసి అనుమానితుల నుంచి సేకరించిన తెమడను నిర్ధారణ పరీక్షలకు పంపిస్తున్నారు. క్షయ అంతానికి లక్ష్యాన్ని నిర్దేశించి నియంత్రణ చర్యలు చేపడుతున్నారు. ఆశించిన స్థాయిలో కేసులు తగ్గడం లేదు. వ్యాధి సోకిన వారికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరు నెలల పాటు ఉచితంగా మందుల పంపిణీ చేస్తున్నారు. డ్రగ్ రెసిస్టెన్సీ కేసులకు రెండేళ్ల పాటు మందులు అందజేస్తున్నారు. ప్రధాన మంత్రి నిక్షయ పోషణ్‌లో భాగంగా నెలకు రూ.500 ఆర్థిక సాయమిస్తున్నారు.

అవగాహనతో క్షయ అంతంచంద్రశేఖర్, జిల్లా క్షయ నియంత్రణ అధికారి, సూర్యాపేటజిల్లాలోని క్షయ వ్యాధిగ్రస్థులను గుర్తించడానికి సిబ్బంది తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఈ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ.. లక్షణాలున్న బాధితులను గుర్తించి ఉచితంగా చికిత్స అందిస్తున్నాం. ఇప్పటి వరకు చికిత్స తీసుకున్న వారిలో అత్యధిక శాతం మంది కోలుకుంటున్నారు. క్షయ లక్షణాలున్న వారు వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలి. నిర్లక్ష్యం చేస్తే రోగనిరోధక శక్తి తగ్గి ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. అవగాహనతోనే వ్యాధిని అంతం చేయవచ్చు.

# పదికి ప్రత్యేకం.. శతశాతం లక్ష్యం

హుజూర్‌నగర్ : పదో తరగతిలో విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించేందుకు జిల్లా అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ఇప్పటికే విద్యార్థులకు దీపిక పుస్తకాలు అందించడం, ప్రత్యేక తరగతుల నిర్వహణ తదితర కార్యక్రమాలు అమలు చేస్తున్న విద్యాశాఖ వాటి పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. మండలానికో కమిటీ వేసి ఇక ముందు వారితోనూ పాఠశాలల పనితీరు, పది విద్యార్థుల ప్రగతిని పరిశీలించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మండలస్థాయి ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటు చేయడం వల్లఫలితాలు ఉంటాయని జిల్లా అధికారులు భావిస్తున్నారు.

కమిటీలు ఇలా..

జిల్లా అధికారులు మండలానికో ప్రత్యేక కమిటీని నియమించి, వెంటనే పాఠశాలలను తనిఖీ చేయాలని వారిని ఆదేశించారు. ఈ కమిటీలో మండల తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, నోడల్ అధికారి, ఒక సీనియర్ ప్రధానోపాధ్యాయుడిని నియమించారు. జిల్లా వ్యాప్తంగా 23 కమిటీలను ఏర్పాటు చేసి వారిని వెంటనే పాఠశాలలు సందర్శించాలని ఆదేశించారు.

వీటిని పరిశీలిస్తారు..



ప్రత్యేక కమిటీల ఏర్పాటు ప్రధాన ఉద్దేశం శత శాతం ఫలితాలు సాధించడమే అయినా ప్రత్యేకంగా కమిటీలు పాఠశాలలకు పోతున్నాయి కాబట్టి మిగిలిన విద్యా కార్యక్రమాలను కూడా పరిశీలించి నివేదికలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వార్షిక పరీక్షలకు పదో తరగతి విద్యార్థుల సంసిద్ధత ఎలా ఉందో వీరు పరిశీలిస్తారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు అమలవుతున్న లక్ష్య కార్యక్రమాన్ని, ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి అయిదో తరగతి వాళ్లకు అమలు చేస్తున్న తొలిమెట్టు కార్యక్రమాన్ని కూడా అధికారులు పరిశీలిస్తారు. ప్రత్యేక కమిటీలు ఆయా పాఠశాలలను సందర్శించి అమలవుతున్న విద్యా కార్యక్రమాలను పరిశీలించి నివేదిక తయారు చేయడంతోపాటు పాఠశాలల స్థాయిలో ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు కూడా చేస్తారు.

ఉత్తమ ఫలితాల సాధనకు..


విద్యార్థులకు జరుగుతున్న ప్రత్యేక తరగతులు, విద్యా ప్రమాణాలు పరిశీలించి ఇంకా ఎలా పెంపొందించుకోవాలో సూచిస్తారు. పాఠ్యపుస్తకాల అధ్యయనం, అభ్యసన దీపిక పుస్తకాల వినియోగం ఎలా ఉందో కమిటీ ప్రత్యేకంగా పరిశీలిస్తుంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో జిల్లాలో 11,946 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయబోతున్నారు. వీరందరూ అన్ని అంశాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యం దిశగా కమిటీలు పనిచేయనున్నాయి.

# పీడిస్తున్న క్యాన్సర్ మహమ్మారి

నల్గొండ : నెల క్రితం జిల్లా కేంద్రంలోని తులసీనగర్‌కు చెందిన 44 ఏళ్ల మహిళ రొమ్ము క్యాన్సర్ బారిన పడ్డారు. క్యాన్సర్ నాలుగో స్థాయికి చేరడంతో ఆమెను జనరల్ ఆసుపత్రి వార్డులో చేర్చారు. చికిత్స పొందుతూనే ఆమె వారం క్రితం మృతి చెందారు. మృతదేహాన్ని తీసుకెళ్లడానికి కుటుంబ సభ్యులు ముందుకు రాకపోవడంతో రెండు రోజులు శవాగారంలో ఉంచి అనంతరం మున్సిపల్ సిబ్బంది ఖననం చేశారు.

కనగల్ మండలం జి.యడవెల్లి గ్రామానికి చెందిన 50 ఏళ్ల మహిళ రొమ్ము క్యాన్సర్ సోకింది. అవగాహన లేకపోవడంతో నాలుగో స్టేజీ వచ్చిన తరువాత ఆరోగ్య మహిళా కేంద్రంలో చూపించారు. ఫలితం లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స అందించినా ప్రయోజనం లేకపోవడంతో నెల క్రితం మృతిచెందారు.దేవరకొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన 55 ఏళ్ల మహిళ గర్భాశయ క్యాన్సర్ బారిన పడటంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. రూ.3 లక్షలకు పైగా ఖర్చు చేశారు. అయినా ఆరు నెలల వ్యవధిలోనే మృత్యువాత పడ్డారు. జిల్లాలో ఇలాంటి బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది.

జిల్లాలో క్యాన్సర్ మహమ్మారి ఏటికేడు విస్తరిస్తోంది. జిల్లాలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ల బాధితులు 880 మంది, రొమ్ము క్యాన్సర్ బాధితులు 461 మంది ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ లెక్కలు చెబుతున్నాయి. లెక్కల్లోకి రానివారు కూడా అధికంగానే ఉంటారు. బాధితుల సంఖ్య క్రమేణా పెరుగుతున్నా జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్యులు ఒక్కరూ అందుబాటులో లేకపోవడం విచారకరం. కనీసం జనరల్ ఆసుపత్రిలో ప్రత్యేక వైద్యులను నియమిస్తే బాధితులకు శస్త్రచికిత్సలు, కీమోథెరఫీ వంటి వైద్యం అందుబాటులోకి వస్తుంది. ఎలాంటి క్యాన్సర్ లక్షణాలు కన్పించినా స్థానికంగా ఉండే



ఎంబీబీఎస్ వైద్యుల సూచనతో మాత్రలు వాడుతున్నారు. వారి సిఫార్సుతో హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి వెళుతున్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద ఎక్కువ శాతం మంది చికిత్స పొందుతున్నా.. కొందరు ఆర్థిక స్థోమత ఉన్న వారు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు.

ఆలనా పథకం ద్వారా చికిత్స-డా.అన్నిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్‌వో, నల్గొండ

జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలో ఆలనా పథకం కింద క్యాన్సర్ బాధితులకు అనుభవం ఉన్న వైద్యుల ద్వారా చికిత్స అందిస్తున్నాం. ఎంఎన్‌జేలో చికిత్స పొందుతున్న వారికి ప్రత్యేక వాహనం ద్వారా గ్రామాలకు వెళ్లి అవగాహనతో పాటు మందులు అందజేస్తున్నాం. క్యాన్సర్ నాలుగో దశకు వచ్చిన వారికి చికిత్స, పౌష్టికాహారం అందిస్తున్నాం. ఆరోగ్య మహిళా కేంద్రాల ద్వారా మగువలకు మామోగ్రఫితో పాటు గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు సైతం చేసి చికిత్సలు అందేలా చూస్తున్నాం.

# పిల్లల దత్తత.. తల్లిదండ్రులకు సాంత్వన

వికారాబాద్ : పిల్లలు లేని వారికి, ఇక పుట్టరు అనే వారికి దత్తత ఇస్తూ సాంత్వన చేకూరుస్తోంది.. జిల్లాలోని శిశు గృహ కేంద్రం. తాజాగా కలెక్టర్ చేతుల మీదుగా ఇద్దరు పిల్లలను చెన్నయ్‌కి చెందిన కుటుంబానికి ఇచ్చారు.

**ఇప్పటి వరకు 50 మంది**

మహిళా, శిశు, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2013లో తాండూర్‌లో శిశుగృహాన్ని ప్రారంభించారు. జిల్లా కేంద్రం వికారాబాద్ ఏర్పడటంతో 2018 డిసెంబర్ 11న దీనిని వికారాబాద్‌కు తరలించారు. ఈ కేంద్రం నుంచి ఇప్పటి వరకు 50 మంది శిశువులను ధ్రువ పత్రాలతో దత్తత ఇచ్చారు. ఆ దంపతుల్లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారే కాకుండా వివిధ రాష్ట్రాలకు చెందిన వారుకూడా ఉన్నారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి 6 సంవత్సరాల వయసు ఉన్న శిశువులను పెంచలేని పరిస్థితిలో ఉన్న తల్లిదండ్రులు వికారాబాద్ శిశు గృహకు అప్పగించవచ్చు. వారి ఆలనా, పాలన దగ్గరుండి నిరంతరం పర్యవేక్షిస్తారు.

**ఊయలలో వేయండి**

శిశులను చెత్తబుట్టల్లో, రోడ్డు పక్కన, రైల్వేస్టేషన్‌లో, బస్టాండ్‌లో



వదిలిపెట్టకుండా తాండూరు జిల్లా ఆసుపత్రిలో, వికారాబాద్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఊయల్లో వదిలిపెట్టాలని అధికారులు కోరుతున్నారు. చెత్తబుట్టలో పారవేస్తే శిశువుకు కంటికి, మెదడుకు దెబ్బతగిలినా భవిష్యత్తులో ఎన్నో కష్టాలు పడాల్సి వస్తుందన్నారు.

**వారిని ఒకే కుటుంబానికి ఇస్తారు**

వరుసకు అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లుగా పుట్టిన పిల్లలను ఒకే కుటుంబానికి దత్తత ఇస్తారు. ఎందుకంటే ఇద్దరూ కలిసిమెలిసి ఆరోగ్యంగా, చక్కగా ఎదుగుతారనే ఉద్దేశంతో ఇలా చేస్తామని నిర్వాహకులు వివరిస్తున్నారు.

**అంతా ఆన్‌లైన్‌లోనే..** దత్తత ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే సాగుతుంది. కేంద్ర దత్తత ప్రాధికార సంస్థ (సీఏఆర్ఏ) వెబ్‌సైట్‌ను తెరచి చూస్తే పూర్తి సమాచారం ఉంటుంది. శిశువు కావాలనుకునే వారు వెబ్‌సైట్‌లో పూర్తి సమాచారాన్ని పొందుపర్చాలి. అధికారులు దర్యాప్తు చేసి అన్నీ సక్రమంగా ఉన్నట్లయితే దత్తత ఇవ్వడానికి అంగీకరిస్తారు.

**ఇవ్వటమే కాదు తర్వాతకూడా పరిశీలిస్తాం– శోభారాణి, మేనేజర్, శిశుగృహ, వికారాబాద్**

శిశు గృహ నుంచి తల్లిదండ్రులకు దత్తత ఇవ్వటమే కాకుండా బాగా చూసుకుంటున్నారా లేదా అని పరిశీలిస్తాం. తరచుగా దత్తత తీసుకున్న వారితో సమావేశాలను ఏర్పాటు చేసి పిల్లల పరిస్థితి గురించి ఆరా తీస్తాం. పిల్లల్ని కని పోషించలేని స్థితిలో ఉన్న చెత్తలో పారవేయకుండా శిశుగృహకు అప్పగించండి.

# భూదందాల డొంక కదులుతోంది..!

కరీంనగర్: అక్రమాల తీగను లాగితే.. భూదందాల డొంక కదులుతోంది. వారం కిందట నగరానికి చెందిన ఓ కార్పొరేటర్ సహా మరో నాయకుడిని జైలుకు పంపిన పోలీసులు.. వారిని జ్యుడీషియల్ రిమాండ్ నుంచి కస్టడీలోకి తీసుకొని ఇతర దందాల్లో భాగమైన తీరుపై కూపీలాగారు. వారిని ఆయా ప్రాంతాల్లోని భూముల వద్దకు తీసుకెళ్లి కీలక సమాచారాన్ని సేకరించినట్లు తెలుస్తోంది. కరీంనగర్, గంగాధర సమీపంలోని ఓ ఫాంహౌజ్‌తో పాటు వారి నివాస గృహాల్లో తనిఖీ చేసి విలువైన పత్రాలు స్వాధీనపర్చుకున్నట్లు తెలిసింది. గతంలో ఫిర్యాదు ఇచ్చిన కేసు మాత్రమే కాకుండా ఇతరత్రా ఏఏ భూముల విషయంలో వీరి పాత్ర ఉందనే అదనపు సమాచారాన్ని సేకరిస్తున్నారు. కస్టడీ గడువు పూర్తయిన తరువాత తిరిగి వారిని జైలుకు పంపించారు. బెయిల్ కోసం వారు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇదే సమయంలో మరికొందరి బాధితుల దరఖాస్తులను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తు న్నారు. చట్టపరంగా శిక్షించే విధంగా పురోగతిని చూపుతున్నారు.

మరో కార్పొరేటర్ భూదందాలో భాగంగా బాధితుడిని బెదిరించి డబ్బులు వసూలు చేశాడనే ఫిర్యాదుతో కరీంనగర్ కార్పొరేషన్‌కు చెందిన భారాస



కార్పొరేటర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరు పర్చారు. దీంతో ఆయనకు న్యాయస్థానం 14 రోజుల పాటు జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. దీంతో వరుసగా ఇద్దరు కార్పొరేట ర్లు భూ అక్రమాల విషయంలో కటకటాలకు వెళ్లడం స్థానికంగా సంచలనాన్ని రేకెత్తిస్తోంది. భూందాలకు పాల్పడే వారిలో కొత్త గుబులును పుట్టిస్తోంది. కొన్ని నెలల కిందట ఇదే కార్పొరేటర్ నిర్మిత భవనాలను బుల్డోజర్‌తో నేలమట్టం చేశారనే అభియోగాలున్నాయి. ఓ ప్రభుత్వ ఉద్యోగికి సంబంధించిన భూమి విషయంలో రూ. 40 లక్షలు డిమాండ్ చేసి రూ. 10 లక్షల వరకు వసూలు చేశారని.. ఇందుకోసం గూగుల్ పే ద్వారా కార్పొరేటర్ ఇంటి సభ్యులకు డబ్బులను పంపిన ఆధారాలను పోలీసులకు చూపడంతో ఈ తరహా చర్యలు కనిపించాయి. ఇక విచారణలో ఉన్న ఇతర కేసులను పరిశీలి స్తున్న పోలీసులు.. మరో నలుగురు కార్పొరేటర్లపైనా ఒకటి రెండు రోజుల్లో చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. పట్టణానికి చెందిన కొందరు బాధితులు సదరు కార్పొరేటర్లు కూడా తమకు భూమి విషయంలో అన్యాయం చేశారనే ఫిర్యాదులను ఆధారాలతో పాటు సీపీకి అందించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. దీంతో విచారణలో ఉన్న ఒక కేసులో నేడో రేపో మరో కార్పొరేటర్‌ను అరెస్ట్ చేయబోతున్నా రు. ఇదే బాటలో పక్కపక్కనే ఉన్న రెండు డివిజన్ల కార్పొరేటర్లపైనా ఫిర్యాదులు అందడటంతో వారిపైన దృష్టి సారించినట్లు సమాచారం.

# ముందస్తు సమాచారం.. సేద్యం లాభదాయకం



వికారాబాద్ : భారత వాతావరణ శాఖ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు, అన్నదాతలకు మేలుచేసే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతి ఒక్కరికీ..ప్రతి ఇంటికీ వాతావరణ సమాచారాన్ని అందించేందుకు సమాయత్తమైంది. ఈ క్రమంలోనే 'హర్‌హర్ మౌసం..హర్‌ఘర్ మౌసం' పేరిట కొత్త యాప్‌ను ఐఎండీ 150వ వార్షికోత్సవం సందర్భంగా రూపొందించింది. దీన్ని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఇటీవలే దిల్లీలో విడుదల చేశారు. హైదరాబాద్ వాతావరణ కేంద్రంలోనూ అధికారులు ఈ యాప్‌ను విడుదల చేయడంతోపాటు ఈ సేవలు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయని పేర్కొనడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు సమస్యలను కొంతైనా అధిగమించవచ్చని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

**ఇవీ ప్రయోజనాలు**

'హర్‌హర్ మౌసం..హర్‌ఘర్ మౌసం' యాప్ ద్వారా ప్రతిరోజూ వాతావరణంలో కలిగే మార్పులను తెలుసుకోవచ్చు.

తెలుగు, హిందీ, ఆంగ్లం తదితర భాషల్లో సమాచారం లభిస్తుంది. కాబట్టి ఎవరికీ భాషా సమస్య ఉండదు.

రానున్న ఐదు రోజుల్లో వాతావరణం ఎలా ఉంటుందనేది కూడా ముందే తెలుస్తుంది. తద్వారా ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించి అప్రమత్తంగా ఉండవచ్చు.

విత్తనాలు, ఎరువులు, నీటిపారుదల, పురుగు మందుల వినియోగం వంటి వివరాలు కూడా అందుతాయి.

వాతావరణ సమాచారం ఆధారంగా పంటలు పండిస్తున్న రైతులు జిల్లాలో వేలమంది ఉన్నారు. వ్యవసాయం లాభసాటిగా లేకపోవడంతో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం కూడా క్రమేపి పెరుగుతోంది. ముందుస్తు సమాచారంతో ఆయా రకాల పనులు చేపట్టడం రైతులకు ప్రయోజనకారిగా మారనుందని అధికారులు పేర్కొంటున్నారు. కోతలు, నూర్పిళ్లు, విక్రయాలు ఇలా వివిధ రకాల పనులకు ముందస్తు సమాచారం ఎంతో మేలు. దీంతో రైతులు నష్టపోకుండా ఉంటారని చెబుతున్నారు.

**అప్రమత్తంగా ఉండవచ్చు– ఆంజనేయులు, రైతు, రాఘవాపూర్**

ముందస్తు సమాచారంతో అప్రమత్తంగా ఉండవచ్చు. స్థానిక పరిస్థితులు, అవసరాన్ని బట్టి సాగుకు ఉపక్రమిస్తాం. దీంతో నష్టాల నుంచి కొంతైనా బయటపడినట్లవుతుంది.

**మార్పును అందిపుచ్చుకోవాలి– కె. గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి**

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అన్నదాతల్లో మార్పు రావాలి. పెరుగుతున్న సాంకేతికతను ఎప్పటికప్పుడు వినియోగించుకోవడంలో పోటీ పడాలి. కొత్తగా వాతావరణ శాఖ తీసుకువచ్చిన యాప్ గురించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలి. వాతావరణాన్ని తెలుసుకుని సాగుకు ఉపక్రమిస్తే నష్టాలను తగ్గించుకున్నట్లవుతుంది.

# అసంపూర్తి నిర్మాణాలపై దృష్టి



గోదావరిఖని : నిర్ణీత గడువులోగా అభివృద్ధి పనులు చేపట్టలేకపోవడం.. పూర్తయిన అభివృద్ధి పనులకు మధ్యంతర బిల్లులు చెల్లించకపోవడం.. నగర పురపాలిక ఖాతాల్లో సాధారణ నిధులు లేకపోయినా ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో అభివృద్ధి పనులు మొదలు పెట్టడం....తీరా బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారు అర్ధాంతరంగా పనిని వదిలిపెట్టడం తదితర కారణాలతో రాష్ట్రవ్యాప్తంగా నగరాలు, పట్టణాల్లో అభివృద్ధి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కాగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నగర/పురపాలికల్లో పెండింగ్‌లో ఉన్న పనులకు సంబంధించి సమగ్ర నివేదికను సమర్పించాల్సిందిగా పురపాలకశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

**నివేదికలు సిద్ధం...** పురపాలక నిర్వహణ శాఖ ఆదేశాల మేరకు నగర/పురపాలికలు తమ ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులతో పాటు తాజాగా ప్రతిపాదించిన, అంచనాలు సిద్ధమైనా ప్రారంభం కాని పనుల వివరాలను ప్రభుత్వానికి సమర్పించేందుకు నివేదికలు సిద్ధం చేస్తున్నారు. పట్టణాలు, నగరాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయించిన వివిధ పథకాల్లో చేపట్టిన పనుల వివరాలను నివేదికలో పేర్కొంటున్నారు.

**రామగుండంలో...** కేటాయించిన నిధులను విడుదల చేయకపోవడంతో రామగుండం నగరపాలక ప్రాంతంలో అత్యధిక పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. రామగుండం ప్రాంతాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం యేటా రూ. 100 కోట్లు కేటాయిస్తామంటూ గతంలో ప్రకటించడం, దానికి అనుగుణంగా అంచనాలు సిద్ధం చేసి అభివృద్ధి పనులు మొదలు పెట్టడం.. తీరా పనులు చేపట్టాక నిధులు విడుదల కాకపోవడంతో గుత్తేదారులు పనులను అర్ధాంతరంగా వదిలేశారు. రూ. 5 కోట్లతో మల్కాపూర్‌లో చేపట్టిన అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం, రూ. 8 కోట్లతో మారుతినగర్‌లో బహుళ ప్రయోజనకర భవనం, రూ. 5 కోట్లతో విఠల్‌నగర్‌లో సమీకృత మార్కెట్, రూ. కోటితో సామాజిక భవనం... ఇలా చాలా భవనాలు పిల్లర్ల వరకే పరిమితమయ్యాయి. తాజాగా ఎన్టీఆర్ నగర్‌లో రూ. 4.5 కోట్లతో చేపట్టిన మరో సమీకృత మార్కెట్ భవనం పునాదులకే పరిమితమైంది. మరో రూ. 2 కోట్లతో పెంచికలపేటలో అత్యాధునిక శ్మశానవాటిక పనులు మొదలే కాలేదు. నిధుల కొరత కారణంగానే మల్కాపూర్ చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చే పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి.

**వివరాలు పొందుపరుస్తున్నాం**–చిన్నారావు, ఎస్ఈ, రామగుండం కార్పొరేషన్

ప్రభుత్వ ఆదేశాల మేరకు పెండింగ్ పనులకు సంబంధించిన వివరాల నివేదికను సిద్ధం చేస్తున్నాం. పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల వివరాలను పొందుపరుస్తున్నాం. ఇటీవల జరిగిన సమావేశంలో పురపాలక నిర్వహణ శాఖ ఉన్నతాధికారులు సూచించిన విధంగా ఇంజినీరింగ్ విభాగంలో నివేదిక సిద్ధం చేస్తున్నాం. త్వరలోనే ప్రభుత్వానికి సమర్పిస్తాం.

# నిధులు కేటాయించినా ముందుకు సాగని పనులు

వేములవాడ : వర్షాకాలంలో ఏటా వరద ఉద్ధృతితో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేములవాడ గ్రామీణ మండలం హన్మాజిపేటలో నక్కవాగు లోలెవల్ కాజ్‌వే వద్ద హైలెవల్ వంతెన నిర్మాణానికి ఆరునెలల క్రితం ప్రభుత్వం రూ. 11.55 కోట్లు మంజూరు చేసింది. రెండేళ్ల క్రితం టెండర్ ప్రక్రియ పూర్తయింది. పనులు దక్కించుకున్న గుత్తేదారు 18 నెలల్లో పనులు పూర్తి చేయాల్సి ఉండగా.. నేటికీ పనులు ప్రారంభించలేదు. వేములవాడ నుంచి హన్మాజిపేట మీదుగా బొల్లారం, లింగపల్లి గ్రామాలతోపాటు కోనరావుపేట మండలం బావుసాయిపేట తదితర గ్రామాల ప్రజలు వాగు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఏటా వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే వరద నీరు నక్కవాగు కల్వర్టుపై నుంచి ప్రవహించగా.. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రెవెన్యూ, పోలీసు యంత్రాంగం వర్షాలు కురిసిన సమయంలో వంతెన వద్ద ప్రమాదాలు చోటు చేసుకోకుండా రక్షణ చర్యలు చేపడుతున్నారు. ఇక్కడ హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టాలని స్థానికుల నుంచి ఏళ్లుగా డిమాండ్ ఉంది. అనేక సందర్భాలలో ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతి పత్రాలను అందించినప్పటికీ ఫలితం లేదు.



**ఏటా ఇబ్బందులు తప్పడం లేదు..** వర్షాకాలంలో నక్కవాగు వద్ద ఏటా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. చిన్నపాటి వర్షానికే వరద ఉద్ధృతి అధికంగా ఉంటుంది. అత్యవసర సమయంలో వేములవాడ ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి దూర ప్రాంతం నుంచి ప్రయాణం చేయాల్సి వస్తుంది. గడువులోగా వంతెన నిర్మాణం పూర్తి చేసి వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి. రాకేష్, హన్మాజీపేట

**త్వరలోనే పూర్తి చేస్తాం** నక్కవాగుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ. 11.55 కోట్లు మంజూరు కావడంతో టెండర్ ప్రక్రియ పూర్తయింది. పనులు ప్రారంభించడానికి కూలీలు వచ్చారు. త్వరలోనే పనులు ప్రారంభించి గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. సతీష్, ఏఈ ఆర్అండ్‌బీ

# వీధి కుక్కలు.. కోకొల్లలు

హైదరాబాద్: నగరంలో చాలా వీధి కుక్కలకు ఇటీవల సంతానం కలిగింది. ఇప్పటికే ఉన్న శునకాల బెడదకు కొత్తతరం కూడా తోడవడం ఆందోళనకరం. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో వీధి కుక్కలకు పిల్లలు పుట్టకుండా జరుగుతోన్న శస్త్రచికిత్సల (ఏబీసీ)పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏబీసీ ఆపరేషన్లేగాక, రేబిస్ నివారణ టీకాలను వేయడంలోనూ బల్దియా నిర్లక్ష్యం వహిస్తోందనే విమర్శలున్నాయి.

**పదేళ్లుగా అవే లెక్కలు..**

జీహెచ్ఎంసీ పరిధిలో ఏడాది క్రితం 5.7 లక్షల కుక్కలున్నట్లు అధికారులు ప్రకటించారు. 70శాతం కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు పూర్తయినట్లు తెలిపారు. మరో 1.7లక్షల కుక్కలకు శస్త్రచికిత్స జరగాల్సి ఉందన్నారు. అధికారులు పదేళ్లుగా దాదాపు ఇవే లెక్కలను కొద్దిగా అటూఇటూ మారుస్తూ.. అవసరమైనప్పుడు పెంచడం, తగ్గించి చూపడం అలవాటుగా మారిందని సిబ్బందే ఆరోపిస్తున్నారు.

**పెంపుడు శునకాలు వీధుల్లోకి..**

రూ.వేలు, లక్షలతో కొనుగోలు చేసిన కొన్ని పెంపుడు కుక్కలను



వయసయ్యాక కొందరు వీధుల్లో వదులుతున్నారు. వాటికి తోడుగా ఏబీసీ ఆపరేషన్లు జరగని మరో 1.7లక్షల కుక్కల కారణంగా గతేడాది వాటి సంతతి భారీగా పెరిగింది. సుమారు 30వేల కుక్క పిల్లలు కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టాయని, మున్ముందు నగరంలో వీధి కుక్కల సంఖ్య 7 లక్షలు దాటుతుందని గచ్చిబౌలిలోని ఓ పశువైద్యాధికారి 'ఈనాడు'తో తెలిపారు.

**రోజూ 250 మందికి కాట్లు**

వీధి కుక్కలు కరుస్తుండటంతో నారాయణగూడలోని ఐపీఎం(ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్)కు రోజూ 200 నుంచి 250మంది బాధితులు వరుసకడుతున్నారు. మెజార్టీ బాధితులు నగరానికి చెందినవారేనని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

**బెంగళూరు, గోవా ఆదర్శమైనా..**

శునకాల సంఖ్య నియంత్రణలో బెంగళూరు, గోవా, అహ్మదాబాద్ నగరపాలక సంస్థల విధానాలు బాగున్నాయి. వాటితో హైదరాబాద్‌కు పోలికలేదని జీహెచ్ఎంసీ అధికారులు కొట్టిపారేస్తున్నారు. ఒకే సీజన్‌లో ఆపరేషన్లు జరగని కుక్కలన్నింటికీ చేయాలని చెబుతున్నారు.

**నిధుల్లేవని.. మొక్కుబడిగా**

రోజువారీ ఏబీసీ ఆపరేషన్లు పెంచేందుకు 3జోన్లలో జంతు సంరక్షణ కేంద్రాల ఏర్పాటుకు బల్దియా నిర్ణయించింది. ఆరు నెలలుగా ఆ పనులకు నిధుల్లేవని అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కార్పొరేటర్ల కమిటీ మొక్కుబడిగా మారింది.

# ట్యాంకరు.. పంపరూ

హైదరాబాద్: వేసవి రాకముందే నీటి ట్యాంకర్లకు భారీగా డిమాండ్ పెరుగుతోంది. ముఖ్యంగా శివారు ప్రాంతాలు, కాలనీలు, వాణిజ్య ప్రాంతాలు, గేటెడ్ కమ్యూనిటీల్లో బోర్ల నుంచి అరకొరగా నీళ్లు వస్తుండటంతో ఎక్కువగా ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. దీంతో ఒక్కసారిగా జలమండలికు చెందిన 'డయల్ యువర్ ట్యాంకర్'కు ఫోన్ కాల్స్ ఎక్కువ సంఖ్యలో వస్తున్నాయి. 20 రోజుల్లో 35 వేల మంది ట్యాంకర్ల కోసం జలమండలిని సంప్రదించారు. దీంతోపాటు ప్రైవేటు ట్యాంకర్లు సరేసరి. జనవరిలోనే పరిస్థితి ఇలా ఉందంటే ఇంకా మార్చి, ఏప్రిల్‌లో భారీగా అవసరం ఉంటుందని భావిస్తున్నారు. గతంలో పోల్చితే శివార్లు విస్తరించాయి. ఓఆర్ఆర్ దాటి నిర్మాణాలు పుట్టుకొస్తున్నాయి. డిసెంబరు, జనవరి నాటికి భూగర్భ జలాలు అడుగంటి ప్రాజెక్టుల నుంచి వచ్చే నీటి సరఫరా తగ్గుతోంది. గతంలో మంజీరా, సింగూరు నుంచి నగరానికి నిత్యం 120 మిలియన్ గ్యాలన్లు తరలించేవారు. ప్రస్తుతం ఇందులో సగం కూడా రావడం లేదు. ఇందులో ఎక్కువ శాతం నీటిని మిషన్ భగీరథ పథకాలకు తరలిస్తున్నారు. మంజీరా నుంచి నీళ్లు తగ్గడంతో కూకట్‌పల్లి, మాదాపూర్, రామచంద్రపురంలాంటి ప్రాంతాలపై ఆ ప్రభావం స్పష్టంగా కన్పిస్తోంది. ప్రస్తుతం ఆయా ప్రాంతాలకు గోదావరి, కృష్ణా నీటిని తరలిస్తున్నారు.




నాగార్జున్‌సాగర్‌లో కూడా నీటి మట్టాలు వేగంగా తగ్గుతున్నాయి.

జనవరిలో ట్యాంకర్లు పంపిన డివిజన్లు.. రామచంద్రాపురం 11,894, ఎస్ఆర్‌నగర్ 6,540, కూకట్‌పల్లి 4,315, మణికొండ 2,121, నిజాంపేట 2,021, నారాయణగూడ 1,331. ఆస్మాన్‌గఢ్ 131, ఎస్ఆర్‌నగర్ 260, నారాయణగూడ 103.

**పలు ప్రాంతాల్లో భారీగా..**

గ్రేటర్‌లో రోజు విడిచి రోజు నీటి సరఫరా 45 నిమిషాల నుంచి గంటన్నర వరకు జరుగుతోంది. తక్కువ ఒత్తిడితో సంపులు నిండటం లేదని ఫిర్యాదులొస్తున్నాయి. దీంతో ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. ఎస్ఆర్‌నగర్, నారాయణగూడలో ట్యాంకర్లకు డిమాండ్ ఉంది. ఎక్కువగా హోటళ్లు, ఇతర వాణిజ్య ప్రాంతాలు ఉండటంతో నీటి వాడకం పెరుగుతోంది. వేసవి దృష్ట్యా నీటి వాడకంలో ప్రజలు కూడా పొదుపు చర్యలపై దృష్టి పెట్టాలి. జలమండలి సరఫరా చేసే నీటిని రోడ్డు, బండ్లు, ఇళ్లు కడగడానికి వాడకూడదు. నల్లాకు పైపు పెట్టి నీటి వృథా చేయకుండా బకెట్‌లోకి తీసుకొని వాడుకుంటే మంచిది.

## పైపైనే పూడికతీత..
## నామమాత్రంగా మరమ్మతులు

కరీంనగర్ : వర్షాకాలం ప్రారంభమైంది.. ఏ సమయంలో భారీ వర్షం పడుతుందో తెలియదు. నాలాలు, వరద కాల్వల్లో పూడిక తీత పనులు మాత్రం పూర్తి కాలేదు. కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో 20 రోజుల కిందట ప్రారంభించిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. వరద కాల్వలు పొంగి పొర్లకుండా, చెత్త చెదారం లేకుండా పూడిక తొలగించాల్సి ఉండగా అధిక ప్రాంతాల్లో పూర్తి కాలేదు. 18 ప్రాంతాలు ఎంపిక

నగర పాలక సంస్థ పరిధిలో సుమారు 35 కిలోమీటర్ల పొడవునా వరద, మురుగునీటి కాల్వలు ఉన్నాయి. ముంపు ప్రాంతాలను పరిగణనలోకి తీసుకొచ్చి ఎక్కడైతే మట్టి, పూడిక ఉందో అక్కడనే తొలగించేందుకు 18 ప్రాంతాలను ఎంపిక చేశారు. మొత్తం 11.77 కి.మీ పొడవునా పూడిక, మట్టి తొలగించేందుకు రూ. 67.79 లక్షలు



కేటాయించారు. ఒక్కో ప్రాంతంలో 180 మీటర్ల నుంచి మొదలుకొని 2500 మీటర్ల వరకే ఉండటంతో ఆయా ప్రాంతాల్లో వరద కాల్వలు పూర్తి స్థాయిలో పూడిక తొలగించే అవకాశాలు కనిపించడంలేదు.

కొంతమేర శుభ్రం

వరద కాల్వల్లో భారీ స్థాయిలో మట్టి, పూడిక నిండి ఉంటుండగా అధికారులు మాత్రం పైపైనే పనులు చేయిస్తున్నారు. పూర్తి స్థాయిలో తొలగించాలంటే క్యూబిక్ మీటర్ చొప్పున పెద్ద ఎత్తున నిధులు చెల్లించాల్సి ఉండటంతో కొంతమేరకు పరిమితమయ్యారు. మంకమ్మ తోట రెండో ఠాణా పక్కన ఉన్న కాల్వలో పూడిక తీసిన కొద్దీ బయటకు వస్తోంది. ఇక్కడ రోడ్డుపై వంతెన ఉండటంతో అందులో నుంచి చెత్తా చెదారం తొలగించలేదు. మురుగు ప్రవహించకుండా అలాగే నిలిచి ఉంటుంది. పలు చోట్ల శిథిలం

కాల్వలు పలు చోట్ల కూలిపోగా కనీసం మరమ్మతులు చేయడం లేదు. గోడలు కూలిపోవడం, పక్కన ఉన్న భాగం పడిపోవడంతో వరదతో గండి పడేలా తయారైంది. సాయినగర్, శనివారం అంగడి బజారు, హుస్సేనీపుర, శర్మనగర్, గాంధీ రోడ్డు ప్రాంతాల్లో శిథిలమయ్యాయి. కొన్ని చోట్ల చెట్లు పడిపోయి ఉన్నాయి.

## సాగు వ్యయం.. వ్యవసాయం భారం

కరీంనగర్ : : సాగు వ్యయం ఏటేటా పెరుగుతుండడంతో వ్యవసాయం భారంగా మారుతోంది. యంత్రాల అద్దె, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు, కూలీల రేట్లు ఆకాశాన్నంటుతున్నాయి. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది ఎకరా వరిసాగుకు రూ.వెయ్యి వరకు అదనంగా వెచ్చించాల్సి వస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తుండగా రూ.కోట్లలో భారం పడుతోంది. ప్రస్తుత వానాకాలంలో వ్యవసాయ పనులు ఊపందుకుంటున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2.40 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారుల అంచనా. పెట్టుబడి వ్యయం అమాంతం పెరిగిపోవడంతో రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారు.

1.62 లక్షల ఎకరాల్లో వరి

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 1,62,036 ఎకరాల్లో వరిపంట సాగు కానున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. 1,347 ఎకరాల్లో మొక్కజొన్న, 74,492 ఎకరాల్లో పత్తి, 3 ఎకరాల్లో మినుము, 97 ఎకరాల్లో పెసర, 1756 ఎకరాల్లో కంది, 330 ఎకరాల్లో ఇతర పంటలను సాగుచేయనున్నారు. దుక్కులు సిద్ధం చేసిన రైతులు పత్తి, మొక్కజొన్న, కంది పంటల విత్తనాలను విత్తుకున్నారు. వరిసాగులో నాట్లు వేసే ప్రక్రియ క్రమంగా ఊపందుకుంటోంది. గతేడాదితో పోల్చితే డీజిల్, ట్రాక్టర్ అద్దె, విత్తనాలు, కూలీరేట్లు, పురుగు మందుల ధరలు పెరిగాయి. ఎకరా వరిసాగుకు కనీసం రూ.వెయ్యి వరకు పెట్టుబడి ఖర్చులు పెరిగినా జిల్లాలో వరి రైతులపై సుమారు రూ. 16 కోట్ల అదనపు భారం పడుతోంది.

ధరల పెరుగుదలతో కుదేలు

డీజిల్ ధరలు అడ్డూఅదుపు లేకుండా పెరుగుతుండడంతో ట్రాక్టర్ అద్దె ఖర్చులను యజమానులు పెంచుతున్నారు. రెండేళ్ల క్రితం నాటు వేసేందుకు ఎకరా పొలాన్ని దమ్ము చేస్తే రూ. 5,500 నుంచి రూ. 6 వేల వరకు తీసుకునేవారు. ఈ సంవత్సరం ట్రాక్టర్ అద్దె ఖర్చు రూ. 7,500 వసూలు చేస్తున్నారు. నాట్లు వేసేందుకు కూలీల కొరత నెలకొంది. బిహార్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వచ్చే వలస కూలీలను వినియోగిస్తున్నారు. ఎకరా విస్తీర్ణంలో పొలం నాటువేసేందుకు కూలీలు రూ. 5,000 వేలు అడుగుతున్నారు. ఒక మగ కూలీకి రోజుకు రూ. 900 చెల్లించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. వరి విత్తనాలు, కలుపు నివారణకు చల్లే రసాయన మందు ధరలను ఆయా కంపెనీలు అమాంతం పెంచేశాయి. కూలీలు, ఇతర ఖర్చుల పెరుగుదలతో హలధారులు ఆర్థికంగా కుదేలవుతున్నారు. ఎకరా విస్తీర్ణంలో నాటు వేసే క్రతువు పూర్తయ్యే వరకు గతంలో రూ. 10 వేల ఖర్చు వచ్చేదని, ఈ సంవత్సరం రూ. 12 వేల నుంచి రూ. 14 వేలు వెచ్చించాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. నాట్లు వేసిన తర్వాత కలుపుతీత, ఎరువుల వాడకం, పురుగు మందుల పిచికారి, వరికోత, ధాన్యాన్ని మార్కెట్‌కు తరలింపు తదితర పనులకు ఖర్చులు అదనం. ఎకరా పొలంలో వరిసాగు చేయడానికి దమ్ము మొదలుకొని ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకెళ్లి శుద్ధిచేసే వరకు రూ. 35 వేల నుంచి రూ. 40 వేల వరకు పెట్టుబడి వ్యయం అవుతోంది. మధ్యలో అకాల వర్షాలు, తెగుళ్లు సోకితే పెట్టుబడి ఖర్చులు సైతం చేతికందక, నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.

కౌలు రైతు దయనీయ పరిస్థితిధరల పెరుగుదలతో వారిపై పెనుభారం పడుతోంది. వరిసాగు మినహా పత్తి, ఇతర ఆరుతడి పంటల సాగు కోసం ఒకసాలు తీయడానికి గతంలో రూ. 800 వరకు ఖర్చుకాగా ఇప్పుడు రూ. 1,200 ఖర్చు వస్తోంది. గంటకు రూ. 650 ఉన్న ప్లౌ (రెండు నాగళ్లు) వ్యయం రూ.వెయ్యికి పెరిగింది. రోటవేటర్ యంత్రాన్ని తిప్పితే గతంలో గంటకు రూ. 1,800 ధర ఉండగా ప్రస్తుతం రూ. 2 వేలకు పైగా చేరింది. పెట్రోలు, డీజిల్ ధరలు అమాంతం పెరగడంతో పెట్టుబడికి అదనంగా వ్యయం చేయాల్సి వస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయంలో అన్ని ధరల పెరుగుదలతో కౌలు రైతులు పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

# మళ్లీ మోగిన ఏసీడీ మోత




ఖమ్మం :విద్యుత్తు సంస్థ వినియోగదారులకు వేసవి షాక్‌ను గట్టిగానే ఇచ్చింది. జూన్ నెలలో జారీ చేసిన బిల్లుల్లో 'అదనపు వినియోగ ధరావతు(ఏసీడీ)' పేరిట రూ.వేలల్లో ఛార్జీలు వేయడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ప్రతినెలా వచ్చే బిల్లుతోపాటు, అదనంగా వీటిని చేర్చారు. ఏసీడీ అంటే ఏమిటి, ఇది ఎందుకు వేశారో తెలియక వారు ఆందోళనకు గురవుతున్నారు. జనవరిలోనూ వినియోగదారులపై ఏసీడీని ప్రయోగించి, ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవడంతో విద్యుత్తు సంస్థ విరమించుకుంది.

రూ.వేలల్లో బిల్లులు

నెలవారీ వాడకానికి రూ.వందల్లో బిల్లు వస్తే ఏసీడీ డ్యూ రూ.వందల నుంచి రూ.వేలల్లో వచ్చాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇలా వక్రమార్గంలో తమ నుంచి అదనపు వసూళ్లు చేస్తున్నారని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో సర్వీసులు...

జిల్లాలో మొత్తం 6.1 లక్షల విద్యుత్తు సర్వీసులున్నాయి. వీటిలో వ్యవసాయ కనెక్షన్లు 1.05 లక్షలు పోను బిల్లింగ్ చేయాల్సినవి 5.05 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. అయితే గ్రామీణ ప్రాంతాల్లో రెండు నెలలకు ఒకసారి, పట్టణ ప్రాంతాల్లో నెలనెలా బిల్లింగ్ చేస్తారు. దీంతో ప్రతినెల సుమారు 3.9 లక్షల సర్వీసులకు బిల్లింగ్ చేయాల్సి ఉంది. ఈనెల తీసిన బిల్లుల్లో అధిక శాతం సర్వీసులకు ఏసీడీ డ్యూ పేరిట అదనపు బిల్లులు వచ్చాయి.

ఏసీడీ అంటే...గత ఏడాది కాలంలో వినియోగదారుడు వాడుకున్న సరాసరి యూనిట్లను లెక్కించి రెండు నెలల బిల్లును డిపాజిట్గా అంటే అదనపు వినియోగ ధరావతు(అడిషనల్ కంజప్షన్ డిపాజిట్-ఏసీడీ) జూన్ బిల్లులో చూపించారు. దీన్ని విద్యుత్తు నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ) రెగ్యులేషన్ నెం. 6-2004(సంవత్సరం) ప్రకారం విధించారు. వినియోగదారుడు తాను సర్వీసు తీసుకునే సమయంలో ఒక కిలో వాట్ సామర్థ్యానికి రూ. 200 చొప్పున సెక్యూరిటీ డిపాజిట్(ఎస్‌డీ) చెల్లించాడు. తదుపరి వారు వాడుకునే యూనిట్ల ప్రకారం ఏసీడీని లెక్కిస్తారు. దీనిలో నుంచి ఎస్‌డీ మినహాయించి నికర మొత్తాన్ని వారి బిల్లుల్లో ఏసీడీగా చూపిస్తారు. ఈ డిపాజిట్పై ఏడాదికి ఒకసారి రిజర్వు బ్యాంకు నిర్ణయించిన రేట్ల ప్రకారం వడ్డీ లెక్కించి వడ్డీని వినియోగదారుడి బిల్లులో జమ చేస్తారు. ఈ డిపాజిట్ను సర్వీసు రద్దు చేసుకున్నప్పుడు తిరిగి చెల్లిస్తారు.

జిల్లాలో రూ. 9.92 కోట్ల అదనపు భారం...

జిల్లాలో ఈనెల గృహ వినియోగదారులు 11,580 మందికి రూ. 3.58 కోట్లు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలు వంటి ఇతర వినియోగదారులు 15,342 మందికి రూ. 6.34 కోట్లు ఏసీడీ ఛార్జీలు వేశారు. అంటే మొత్తం 26,922 మంది వినియోగదారులపై రూ. 9.92 కోట్ల భారం మోపారు. అంటే గృహ వినియోగదారులపై సరాసరి రూ. 3,091, ఇతర వినియోగదారులపై సరాసరి రూ. 4,132 అదనపు ఛార్జీలు వడ్డించారు. వీరిలో ఇప్పటి వరకు గృహ వినియోగదారులు 1,151 మంది రూ. 31.32 లక్షలు, ఇతరులు 1,390 మంది రూ. 39.56 లక్షలు చెల్లించారని అధికారులు తెలిపారు.

ఎవరు చెల్లించాలి..పట్టణ ప్రాంతాల్లో అనేక మంది వినియోగదారులు అద్దెకు ఉంటున్నారు. మరి రూ.వేలల్లో నమోదైన ఏసీడీ బకాయి ఎవరు చెల్లించాలనే సమస్య తలెత్తుతోంది. దీనిపై వివాదాలు చెలరేగుతున్నాయి. గృహ యజమానులే దీన్ని చెల్లించాలని అధికారులు చెబుతున్నారు.

వేసవి ప్రభావం

ఈ ఏడాది వేసవి ఉష్ణోగ్రతలు అసాధారణంగా ఉన్నాయి. నివాసాలు, వ్యాపార సంస్థల్లో కూలర్లు, ఏసీల వినియోగం భారీగా పెరిగింది. దీంతో ఏడాది సరాసరి వినియోగం కూడా అదే స్థాయిలో పెరిగింది. దీనివల్ల వినియోగదారు కనెక్షన్ తీసుకున్న సమయంలో చెల్లించిన సామర్థ్యం కన్నా ఎక్కువ వినియోగించినట్లవడంతో ధరావతు వసూలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వినియోగదారుడు గత ఏడాది కాలంలో వాడుకున్న అదనపు విద్యుత్తుకు డిపాజిట్గా ఏసీడీ వసూలు చేస్తున్నాం. ఇది వారి పేరిట డిపాజిట్గా ఉంటుంది. సర్వీసు రద్దు చేసుకుంటే తిరిగి చెల్లిస్తాం. ఎ.సురేందర్, ఎస్ఈ

## అందరికీ అవగాహన..
## ప్రమాదాల నియంత్రణ

గోదావరిఖని: బొగ్గు గనుల్లో ప్రమాదాల నివారణకు యాజమాన్యం అనేక చర్యలు తీసుకుంటున్నా ఆగడం లేదు. సాంకేతికపరమైన రక్షణ చర్యలు చేపడుతున్నా చిన్న చిన్న కారణాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. దీంతో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. రక్షణ చర్యలపై అవగాహన లేకపోవడం, వాటిని పాటించడంలో క్రమశిక్షణ లోపించడమే కారణమని సింగరేణి గుర్తించింది. ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఈ మేరకు జులై 1 నుంచి 31 వరకు ప్రతి ఉపరితల గని, భూగర్భ గనితో పాటు వివిధ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనుంది. ప్రతి డివిజన్‌కు చెందిన ఏరియా రక్షణ అధికారి.. గనులు, విభాగాల అధికారులను సమన్వయ పరుస్తూ కార్మికులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు చేపట్టింది. దీనికి పిట్ రక్షణ కమిటీ సభ్యులను కూడా భాగస్వాములను చేయాలని భావిస్తోంది.

2023-24లో 75 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సింగరేణి లక్ష్యంగా నిర్దేశించింది. ప్రమాద రహిత ఉత్పత్తి లక్ష్యంగా కొత్తగా 'నా రక్షణ నా బాధ్యత' నినాదంతో ప్రణాళిక రూపొందించింది. ప్రమాదాల వల్ల కార్మికులతో పాటు వారి కుటుంబాలకు కూడా నష్టం జరిగే



అవకాశం ఉండటంతో రక్షణపై వారికి కూడా అవగాహన కలిగించాలని భావిస్తోంది. ఈ మేరకు కార్యక్రమాలకు సంబంధించిన నివేదికలను ప్రతి వారం కార్పొరేట్‌కు పంపించాలని ఆదేశించింది. నెల రోజుల అనంతరం పూర్తి నివేదికలను ఆగస్టు 8 వరకు పంపించాలని సూచించింది.

నా రక్షణ.. కుటుంబానికి భరోసా

ప్రతి కార్మికుడిలో 'నేను రక్షణతో పని చేస్తేనే నా కుటుంబానికి రక్షణగా ఉంటుంద'న్న అభిప్రాయాన్ని కల్పించనుంది. పని స్థలాల్లో రక్షణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని యాజమాన్యం ఆదేశించింది. వాటిపై కార్మికులకు పూర్తి అవగాహన ఉండాలని సూచించింది. గనులపై ఏరియా కమిటీతో పాటు మైన్ కమిటీలు విడతల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నాయి. ఆ సమయంలో ఏబీసీడీ(ఎ-అటిట్యూడ్, బి-బిహేవియర్, సి-కల్చర్, డి-డిసిప్లిన్) అంశాలపై కార్మికులకు వివరిస్తారు. దీంతో వారిలో మార్పు రావడంతో పాటు ప్రమాదాలు పూర్తిగా నివారించే అవకాశం ఉంటుందని యాజమాన్యం భావిస్తోంది.

అందరి భాగస్వామ్యం

ప్రమాదాల నివారణకు చేపట్టిన కార్యక్రమంలో సంస్థలోని ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయనున్నారు. గని మేనేజర్, ఏజెంటు, ఏరియా రక్షణ అధికారి, విభాగాల అధిపతులు, పిట్ రక్షణ కమిటీల ఆధ్వర్యంలో ప్రచారం చేయనున్నారు. ప్రతి విభాగంలో రక్షణ చర్యలు, చట్టాలపై అవగాహన కల్పిస్తారు. దీనిపై విస్తృతంగా ప్రచారం చేసేందుకు విధుల ప్రారంభ సమయంతో పాటు మధ్యలో విశ్రాంతి సమయంలో కూడా కార్మికుల వద్దకు వెళ్లి అవగాహన కల్పిస్తారు. కింది నుంచి పైస్థాయి అధికారి వరకు అందరూ భాగస్వాములైన ప్రమాదాలు నివారించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

# అవార్డుల దవాఖానా




ఖమ్మం : భద్రాచలం ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి నాణ్యమైన వైద్యసేవలు అందిస్తూ రోగుల పాలిట వరంగా మారింది. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లోని సరిహద్దు ప్రాంత వాసులతో పాటు భద్రాద్రి మన్యం వాసులు దీనిపై ఆధారపడ్డారు. వైద్య విధాన పరిషత్‌లో 200 పడకలు గల ఏరియా ఆసుపత్రి రాష్ట్రంలో ఇదొక్కటే కావడం విశేషం. పేరుకు 200 మంచాలని ఉన్నా 250 పడకలు అందుబాటులో ఉండడం దీని ప్రత్యేకత. కొన్నేళ్లుగా కాయకల్ప, ఎన్‌క్వాస్ పురస్కారాలు వరిస్తున్నాయి. మరోసారి ఎన్‌క్వాస్ బృందం రానుందని సూపరింటెండెంట్ డా. రామకృష్ణ, ఆర్ఎంఓ డా. రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. నవజాత శిశు చికిత్స కేంద్రంలో 20 మంచాలున్నాయి. నెలలోపు పసిబిడ్డలకు నిపుణులు వైద్యమందించే వార్డు. అత్యవసర పరిస్థితుల్లో ఇతర ఆసుపత్రులకు రిఫరల్ చేయకుండా ఇటీవల ఎలక్ట్రానిక్ సేవలను అమల్లోకి తెచ్చారు. హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రికి అనుసంధానం చేశారు. ఇ-చికిత్స విధానంలో కంప్యూటర్ మానిటర్ సాయంతో ఇక్కడి పరిస్థితిని అక్కడి నిపుణులు పరిశీలిస్తారు. ఆన్‌లైన్ ద్వారా తగిన సలహాలతో ఇక్కడి వైద్యులు అవసరమైన చికిత్సలు అందిస్తున్నారు. ఈ వార్డుకు నేషనల్ నియోనేటాలజీ ఫోరం నుంచి 2021 డిసెంబరులో అక్రిడిటేషన్ లభించింది. ఈ ఏడాది డిసెంబర్ వరకు అమలులో ఉంటుంది. 2021-22లో ఉత్తమ సేవల పురస్కారాన్ని ప్రభుత్వం అందించింది. పిల్లల వార్డులో 40 పడకలున్నాయి. ఏడాది నుంచి 14 ఏళ్లలోపు పిల్లలకు సేవలు అందించేందుకు ప్రత్యేక విభాగాలు కొలువుదీరాయి. ఇటీవల ముస్కాన్ పథకం కింద ప్రశంస పత్రం దక్కింది. ఇది మూడేళ్లపాటు అమల్లో ఉండటంతో నగదు ప్రోత్సాహకాలు అందుతాయి.

కాన్పుల వార్డులో 40 పడకలున్నాయి. ఇటీవల లక్ష్య పథకానికి ఈ వార్డు ఎంపికైంది. మూడేళ్ల పాటు నగదు ప్రోత్సాహకాలతో పాటు అభివృద్ధి పనులకు ప్రాధాన్యం లభించినట్టే. సాధారణ కాన్పుల్లో ప్రతిభ చాటినందుకు 2018లో పురస్కారం వరించింది.

పది మంచాలు గల ఐసీయూ అపర సంజీవనిగా మారింది. ఇది హైదరాబాద్‌లోని నిమ్స్‌కు అనుసంధానం కావడంతో అవసరమైనప్పుడు ఇ-చికిత్సలు అందుతున్నాయి.

సిబ్బందిని సర్దుబాటు చేస్తే..

అన్ని విభాగాలకు కలిపి 70 మంది వైద్యులు అవసరం. ప్రస్తుతం 28 మంది పనిచేస్తున్నారు. ఐదుగురు మానేశారు. గైనకాలజిస్టులు ఆరుగురికి ఇద్దరే ఉండటంతో కాన్పుల సంఖ్య నెలకు 200 కంటే తగ్గింది. నర్సింగ్ సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇలాంటి ఇబ్బందులు ఉన్నప్పటికీ వైద్యసేవల్లో రాజీపడటం లేదు. దీని అవసరాన్ని గుర్తించి జిల్లా ఆసుపత్రిగా మారిస్తే గిరిజన ప్రాంతంలో అన్ని వర్గాల వారికి నిపుణుల సేవలు అందుతాయి. కొత్తగూడెంలో జిల్లా ఆసుపత్రికి అనుబంధంగా వైద్య కళాశాల వచ్చింది. కొంతమంది సిబ్బంది కళాశాలలో విధులు నిర్వర్తిస్తూ ఆసుపత్రికి రావటం లేదు. అలాంటి వారిని ఏరియా ఆసుపత్రికి బదిలీ లేదా సర్దుబాటు చేస్తే మన్యం దవాఖానాకు మహర్దశ వచ్చినట్లే.

## వర్గ రాజకీయాలే అసలు సమస్య

నల్గొండ: రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ వాతావరణంతో.. కాంగ్రెస్ పార్టీ ఉత్సాహంగా ఉండగా.. ఉమ్మడి జిల్లాలో మాత్రం సీనియర్ నాయకులంతా ఎవరికి వారు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని క్యాడర్ అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఉమ్మడి జిల్లాలోని పన్నెండింటిలో సగం కంటే ఎక్కువ నియోజకవర్గాల్లో పార్టీ నేతల మధ్య వర్గ భేదాలు పార్టీ బలోపేతానికి అడ్డుకట్ట వేస్తున్నాయి. నల్గొండ, సూర్యాపేట జిల్లాలో ఇటీవల 20 రోజులు సాగిన సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో దేవరకొండ, నకిరేకల్, సూర్యాపేట నియోజకవర్గాల్లో బహిరంగంగానే నాయకులు గొడవపడటం పరిస్థితికి అద్దం పడుతోంది. ఉమ్మడి జిల్లాలోని పలువురు కీలక నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే ప్రచారం జరుగుతున్నా...వారిని పార్టీలో చేర్చుకోవడానికి జిల్లాకు చెందిన సీనియర్ నేతలు ఆసక్తి చూపడం లేదని సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. పైగా ఆలేరు, నకిరేకల్, నల్గొండ, మునుగోడు, తుంగతుర్తి, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో పార్టీ బాధ్యులు లేకపోవడంతో.. ఎవరికి వారు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

విభేదాలతో ఎవరికి వారే..

భువనగిరి నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి, ఆ జిల్లా డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి వ్యతిరేకంగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్‌రావు ఠాక్రేకు ఇటీవలే కొందరు భువనగిరి పట్టణానికి చెందిన నేతలు వినతి పత్రం ఇచ్చారు. తొలి విడతలో జరిగిన భట్టి పాదయాత్రలో ఆలేరు నియోజకవర్గ పార్టీ నాయకుడు బీర్ల అయిలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో బహిరంగంగానే గొడవ పడ్డారు. దేవరకొండలో మాజీ ఎమ్మెల్యే బాలునాయక్‌తో పాటూ టిక్కెట్ ఆశిస్తున్న బిల్యానాయక్, కిషన్‌నాయక్, రవినాయక్ పార్టీ కార్యక్రమాలను వేరేర్వుగా నిర్వహిస్తున్నారు. ఇటీవల భట్టి పాదయాత్రలో నిత్యం ఇక్కడ గొడవలు జరగడంతో ఒక దశలో భట్టి అసహనానికి గురికావడం గమనార్హం. దేవరకొండ నియోజకవర్గంలో జరిగిన పాదయాత్రకు హాజరైన కోమటిరెడ్డి, సొంత నియోజకవర్గమైన నల్గొండలో హాజరుకాకపోవడంతో పార్టీ శ్రేణుల్లో వ్యతిరేకత వ్యక్తమైంది.

నకిరేకల్, సూర్యాపేట నియోజకవర్గాల్లో వర్గ విభేదాలు ఇప్పటికే తారస్థాయిలో ఉండగా...రానున్న కాలంలో ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకుంటుండటంతో పరిస్థితి ఏంటనే ఆందోళన కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. మిర్యాలగూడలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పురపాలిక పార్టీ ఫ్లోర్ లీడర్ లక్ష్మారెడ్డి మధ్య ఇప్పటికే విభేదాలు ముదిరి పాకాన పడ్డాయి. మునుగోడు ఉప ఎన్నికల్లో పార్టీ టిక్కెట్ ఆశించి భంగపడిన కృష్ణారెడ్డి ప్రస్తుతం నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తుండగా.. తిరిగి పార్టీలోకి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వస్తారన్న ప్రచారంతో పార్టీ కార్యక్రమాల నిర్వహణలో పురోగతి ఉండటం లేదు.

ఖమ్మం జనగర్జనకు సమాయత్తం

జులై 2న.. ఖమ్మంలో నిర్వహించబోయే పార్టీ జనగర్జన సభకు ఉమ్మడి జిల్లా నుంచి భారీగా జనాన్ని తరలించాలని టీపీసీసీ జిల్లాలోని సీనియర్ నేతలను ఆదేశించినట్లు తెలిసింది. దీంతో సరిహద్దుల్లోని కోదాడ, హుజూర్‌నగర్, సూర్యాపేటతో పాటూ నల్గొండ, నకిరేకల్, భువనగిరి నుంచి జనాన్ని తరలించేందుకు ఆయా నియోజకవర్గ నేతలు సమాయత్తమవుతున్నారు. పార్టీ శ్రేణులు హాజరై రాహుల్‌గాంధీ సభను విజయవంతం చేయాలని పీసీసీ మాజీ అధ్యక్షులు, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే శ్రేణులకు విజ్ఞప్తి చేస్తున్నారు. హీనపక్షం ఉమ్మడి జిల్లా నుంచి 30 వేల మంది వరకు తరలించాలని యోచిస్తున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. 'రాహుల్ సభను విజయవంతం చేసేందుకు ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి ప్రత్యేకంగా నల్గొండ పార్లమెంటు నుంచి భారీ ఎత్తున ప్రజలు ఖమ్మం సభకు స్వచ్ఛందంగా వెళ్తారని' ఎంపీ ఉత్తమ్‌కు వెల్లడించారు.

# రైతు వేదిక నిధులు అందక..!



కొత్తగూడెం : వ్యవసాయశాఖ సేవలు అన్నదాతలకు మరింత చేరువయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్లస్టర్ల వారీగా రైతు వేదికలు నిర్మించింది. సాగులో సలహాలు, సూచనలు వీటి ద్వారా అధికారులు అందిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ రైతు వేదికల నిర్వహణపై ఉన్నతాధికారులకు పట్టింపు లేకుండా పోయిందనే వాదనలు వినిపిస్తున్నాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో వ్యవసాయ విస్తరణ అధికారులే సొంత డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోంది. నెలలు తరబడి రైతు వేదికల నిర్వహణ భారంగా మారుతోందని ఏఈఓలు వాపోతున్నారు.

ఉభయ జిల్లాల్లో..ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 196 రైతు వేదికలు ఉన్నాయి. వీటి నిర్వహణ బకాయిలు రూ. 1,76,40,000 పేరుకుపోయాయి. ఒక్కో రైతు వేదికకు ప్రతినెల రూ. 9వేలు అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. 2022 ఏప్రిల్ నుంచి 2022 ఆగస్టు వరకు ఐదు నెలలకు ఒక్కో రైతు వేదికకు రూ. 45 వేలు అందించింది. ఆ తరువాత నుంచి గడిచిన పది నెలల నిర్వహణ నిధులు మంజూరు కాలేదు. ఒక్కోరైతు వేదికకు రూ. 90వేల బకాయిలు పేరుకుపోయాయి. అన్నదాతలకు శిక్షణ, ప్రజోపయోగ కార్యక్రమాలు రైతు వేదికల్లో వ్యవసాయ విస్తరణాధికారులు(ఏఈఓలు) అందుబాటులో ఉంటారు. అన్నదాతలకు వ్యవసాయ సంబంధిత సలహాలు, సూచనలు అందిస్తారు. అవగాహన సమావేశాలు, శిక్షణ కార్యక్రమాల సమయంలో కూర్చునేందుకు కుర్చీలు, మైక్‌సెట్ లాంటి సామగ్రిని ప్రభుత్వం సమకూర్చించింది. ఇతర ప్రజోపయోగ కార్యక్రమాలు, వివిధ శాఖల సమావేశాలకు వీటిని వినియోగించుకునేందుకు అవకాశం కల్పించింది.

రైతు వేదికల నిర్వహణకు పది నెలలుగా నిధులు మంజూరు కావటం లేదు. ఈ అంశమై పలుమార్లు ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరైన వెంటనే బకాయిలు చెల్లిస్తాం. అభిమన్యుడు, డీఏఓ, భద్రాద్రి కొత్తగూడెం




ఒంగోలు: యుద్ధానికి తాను రెడీ.. మీరు రెడీనా? అంటూ వైకాపా నేతలకు ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సవాల్ విసిరారు. ప్రజలకు న్యాయం చేయాలనే రాష్ట్ర రాజకీయాల్లోకి వచ్చినట్లు స్పష్టం చేశారు. ఒంగోలులో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. "ఏపీకి ప్రత్యేక హోదా కోసం నేను పోరాడుతుంటే.. వైకాపా వారంతా నాపై ముప్పేట దాడి చేస్తున్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టును జలయజ్ఞం కింద వైఎస్ఆర్ నిర్మిస్తే.. జగన్ సర్కారు దానిని నిర్వహణ కూడా చేయలేకపోతోంది. వైఎస్ వారసులమని చెప్పేవారు 'గుండ్లకమ్మ'ను ఎందుకు పట్టించుకోవడం లేదు. గేట్లు ఊడిపోయినా పట్టించుకోని వారా ఆయన ఆశయాలు నిలబెట్టేది? వైఎస్ హయాంలో 70 శాతం పూర్తయిన వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయలేదు. జగన్ పాలనలో ప్రకాశం జిల్లాకు ఒక్క పరిశ్రమైనా వచ్చిందా? వైకాపాలోనే అసలు వైఎస్ఆర్ లేరు. వై అంటే వైవీ సుబ్బారెడ్డి, ఎస్ అంటే సాయిరెడ్డి, ఆర్ అంటే రామకృష్ణారెడ్డి" అని షర్మిల సెటైర్లు వేశారు.

**ఆ మంత్రికి డ్యాన్స్‌లు తప్ప.. ప్రాజెక్టులు పట్టవు :** అంతకుముందు మద్దిపాడులోని గుండ్లకమ్మ ప్రాజెక్టును కాంగ్రెస్ నేతలతో కలిసి షర్మిల పరిశీలించారు. ప్రాజెక్టు నిర్వహణ కోసం నిధులు మంజూరు చేయలేదన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి సంక్రాంతి డ్యాన్స్‌లు వేయడమే తప్ప.. ప్రాజెక్టుల బాగోగులను చూడటం లేదని విమర్శించారు. ఆమె వెంట మాజీ మంత్రి రఘువీరారెడ్డి తదితరులు ఉన్నారు.

## షర్మిలపై వైకాపా విమర్శలు చేయడం సిగ్గుచేటు: సుంకర పద్మశ్రీ

విజయవాడ: వైఎస్ షర్మిల ఏపీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టి జగన్ పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళు తున్నారని, ఆ విమర్శలు తట్టుకోలేని వైకాపా నాయకులు ఒక మహిళ అని కూడా చూడకుండా సభ్యసమాజం సిగ్గుపడేలా విమర్శలు చేస్తున్నారని ఏపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ మండిపడ్డారు. ఈ సందర్భంగా శనివారం ఆమె విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ వైకాపా నాయకులు ఎమ్మెల్యేలు ఏ రోజూ ప్రజా సమస్యలపై మాట్లాడని వారు ఇవాళ బయటకొచ్చి షర్మిలపై విమర్శలు చేస్తున్నారని, రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన సీఎం జగన్ సమాధానం చెప్పాలని, దిశ చట్టం ఎక్కడ?.. దళితులపై దాడులను షర్మిల ప్రశ్నిస్తున్నారన్నారు. అంబేద్కర్ విగ్రహం పెడితే సరిపోతుందా అని నిలదీస్తుంటే సమాధానం చెప్పలేక వైకాపా నాయకులు షర్మిలపై మాటల దాడి చేస్తున్నారని, ఊరు పేరు తెలియని వారు రాష్ట్రంలో పర్యటిస్తున్నారంటూ వ్యాఖ్యలు చేస్తున్నారని సుంకర పద్మశ్రీ మండిపడ్డారు. "మంత్రి రోజా ఎక్కడ నుంచి వచ్చావు.. నిన్ను విమర్శలు చేస్తున్నారని కన్నీళ్లు పెట్టుకున్నావు, అప్పుడు నీకు అండగా




మేము ఉన్నాం.. జగనన్న వేసే చిల్లర కోసమో, పదవుల కోసమో, మేము పని చేయడం లేదు" అని అన్నారు. మరోసారి వైకాపా నాయకులు షర్మిలపై విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. తండ్రి వైఎస్సార్ మరణాన్ని అడ్డు పెట్టుకుని జగన్ అధికారంలోకి వచ్చారని విమర్శించారు. షర్మిలకు కాంగ్రెస్ శ్రేణులు, రాష్ట్ర ప్రజలు అండగా ఉన్నారని సుంకర పద్మశ్రీ అన్నారు.




## సీట్ల ఫార్ములా ప్రకటించిన ఎస్పీ, డీల్ ఖరారు కాలేదన్న కాంగ్రెస్

లక్నో: బీహార్ రాజకీయాల్లో తలెత్తిన హైడ్రామా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీపై పోరాటానికి ఏర్పడిన 'ఇండియా' కూటమికి గట్టిదెబ్బగా విశ్లేషణలు వెలువడుతున్న నేపథ్యంలో ఉత్తరప్రదేశ్‌లోని సమాజ్‌వాది పార్టీ, కాంగ్రెస్ మధ్య సీట్ల ఒప్పందంపై అవగాహన కుదిరిన సంకేతాలు వెలువడుతున్నాయి. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 11 స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేస్తుందని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ప్రకటించారు. "కాంగ్రెస్‌తో మా స్నేహపూర్వక కూటమి 11 బలమైన సీట్లతో శుభారంభమైంది. గెలుపు ఈక్వేషన్లతో ఈ ట్రెండ్ ముందుకు సాగుతుంది. ఇండియా కూటమి, పీడీఏ వ్యూహం చరిత్రను మారుస్తుంది" అని అఖిలేష్ ట్వీట్ చేశారు.

**కాంగ్రెస్ స్పందన..** అఖిలేష్ ట్వీట్ వెలువడిన కొద్దిసేపటికే కాంగ్రెస్ స్పందించింది. డీల్ ఇంకా కుదరలేదని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేష్ తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు సంబంధించి అఖిలేష్ యాదవ్, అశోక్ గెహ్లాట్ మధ్య చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే వారు కలుసుకుంటారని, చర్చలు ముగిసిన తర్వాతే ఫార్ములా (సీట్ల షేరింగ్) ఏమిటనేది చెప్పగలమని ఆయన అన్నారు. కాగా, తనకు ఇంకా ఎలాంటి సమాచారం లేదని యూపీ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ తెలిపారు. సీట్ల పంపకాలపై సమాజ్‌వాదీ పార్టీతో కాంగ్రెస్ అగ్రనాయకత్వం చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో మొత్తం 80 లోక్‌సభ స్థానాలు ఉండగా, రాష్ట్రీయ లోక్ దళ్‌తో ఇప్పటికే సీట్ల పంపకాన్ని సమాజ్‌వాదీ పార్టీ ఖరారు చేసింది. ఆ ప్రకారం ఆర్ఎల్‌డీ 7 సీట్లలో పోటీ చేయనుంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 71 సీట్లు గెలుచుకోగా, సమాజ్‌వాదీ పార్టీ 5 సీట్లు, కాంగ్రెస్-2, ఆర్ఎల్‌డీ ఒక సీటు గెలుచుకున్నాయి. కాగా, పశ్చిమబెంగాల్‌లో 'ఇండియా' కూటమితో పొత్తు లేదని మమతాబెనర్జీ ఇటీవల ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీకి పలు ప్రతిపాదనలు ఇచ్చినప్పటికీ వాటిని నిర్ద్వంద్వంగా ఆ పార్టీ తోసిపుచ్చినందున టీఎంసీ ఒంటరిగానే ఎన్నికలకు వెళ్తుందని ఆమె తెలిపారు. మరోవైపు, పంజాబ్‌లోనూ కాంగ్రెస్‌తో పొత్తు లేకుండా ఒంటరిగా పోటీ చేస్తామని 'ఆప్' ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఇటీవల తెలిపారు.




గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ రాజధాని దిల్లీలోని కర్తవ్యపథ్‌లో శుక్రవారం జరిగిన పరేడ్ ఆసాంతం ఆకట్టుకుంది. దీనిపై ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా స్పందిస్తూ మన అమేయ సైనిక శక్తిని కొనియాడారు.

ఈ సందర్భంగా శత్రు దేశాలను ఉద్దేశిస్తూ సున్నితంగా ఓ హెచ్చరిక కూడా చేశారు. పరేడ్‌లో సైనిక కవాతు వీడియోను పోస్ట్ చేసిన ఆయన.. "ఇతర దేశాల సైన్యానికి నాదో వ్యక్తిగత సలహా. వీళ్లతో ఎప్పుడూ పెట్టుకోవద్దు" అని రాసుకొచ్చారు. మన సైన్యం శక్తి సామర్థ్యాలను ఉద్దేశిస్తూ 'భారత్ దృఢంగా ఉంది' అనే అర్థం వచ్చేలా ఎమోజీలు జత చేశారు. ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఈసారి జరిగిన గణతంత్ర వేడుకల పరేడ్‌లో మన సైనిక శక్తిని ప్రపంచానికి చాటిచెప్పారు. దేశీయంగా తయారుచేసిన ఆయుధాలతో పాటు నాగ్ క్షిపణులు, టీ-90 భీష్మ యుద్ధ ట్యాంకులు, డ్రోన్ జామర్లు, నిఘా వ్యవస్థలు, వాహనాలపై అమర్చే మోటార్లు, పినాక మల్టిపుల్ రాకెట్ వ్యవస్థ, వెపన్ లొకేషన్ రాడార్ వ్యవస్థలు, బీఎంపీ-2 సాయుధ శకటాలను ప్రదర్శించారు.

ఇక, తొలిసారిగా పూర్తిస్థాయిలో త్రివిధ దళాలకు చెందిన నారీమణులు చేసిన కవాతు, విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



## ఆరోసారి బడ్జెట్ ప్రవేశపెట్టనున్న సీతారామన్.. మొరార్జీ దేశాయ్ తర్వాత ఈమే!

దిల్లీ: భారత మాజీ ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ తర్వాత వరుసగా ఆరు బడ్జెట్‌లు ప్రవేశపెట్టిన ఆర్థికమంత్రిగా నిర్మలా సీతారామన్ రికార్డు నెలకొల్పనున్నారు. ఇప్పటికే ఐదు పూర్తిస్థాయి బడ్జెట్‌లు సమర్పించిన ఆమె.. ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఇంతకుముందు వరుసగా ఐదు కేంద్ర బడ్జెట్లు ప్రవేశపెట్టిన అరుణ్‌జైట్లీ, పి.చిదంబరం, యశ్వంత్‌సిన్హా, మన్మోహన్‌సింగ్‌ను ఆమె అధిగమించనున్నారు. 1959-64 మధ్య మొరార్జీ ఐదు పూర్తిస్థాయి, ఒక మధ్యంతర బడ్జెట్‌ను సమర్పించారు. ఏప్రిల్-మేలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈసారి ఓటాన్ అకౌంట్‌ను ప్రవేశపెట్టనుంది. తద్వారా కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చేవరకు నిధులను వెచ్చించడానికి సర్కార్‌కు వెసులుబాటు ఉంటుంది. ఎన్నికల నేపథ్యంలో బడ్జెట్‌లో విధానపరమైన ప్రకటనలేమీ ఉండకపోవచ్చునని అంచనా వేస్తున్నారు. ఈవిషయాన్ని సీతారామన్ గతనెల ఓ సందర్భంలో స్పష్టంచేశారు. ఓటాన్ అకౌంట్‌కు ఆమోదం లభిస్తే.. ఏప్రిల్-జులై కాలానికి కావాల్సిన నిధులను ప్రో-రేటా ప్రాతిపదికన 'భారత సంఘటిత నిధి' నుంచి ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వానికి అధికారం లభిస్తుంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక 2024-25కు గానూ జూన్‌లో తుది బడ్జెట్‌ను తీసుకొస్తారు.

**భారత తొలి బడ్జెట్..ఈ ఆసక్తికర విశేషాలు తెలుసా? :** 2014లో మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అరుణ్ జైట్లీ కేంద్ర ఆర్థికమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 2014-15 నుంచి 2018-19 మధ్య వరుసగా ఐదు బడ్జెట్లు ప్రవేశపెట్టారు. ఫిబ్రవరి నెల చివరిరోజున బడ్జెట్‌ను తీసుకొచ్చే బ్రిటిష్ కాలం నాటి సంప్రదాయానికి స్వస్తి పలికి ఒకటో తారీఖుకు మార్చిన ఘనత జైట్లీదే. ఆయన అనారోగ్యానికి గురవటంతో.. పీయూష్ గోయల్ ఆర్థికమంత్రి బాధ్యతలు తీసుకొని 2019-20 మధ్యంతర బడ్జెట్‌ను పార్లమెంట్ ముందుంచారు. వేతన జీవుల స్టాండర్డ్ డిడక్షన్ పరిమితిని రూ.10 వేల నుంచి రూ.50 వేలకు పెంచారు. వార్షికాదాయం రూ.5 లక్షలు మించనివారికి ట్యాక్స్ రిబేట్‌ను రూ.2,500 నుంచి రూ.12,500 చేశారు. 2019లో రెండోసారి మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీతారామన్‌కు ఆర్థిక శాఖ బాధ్యతలు అప్పగించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ తర్వాత బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండో మహిళగా గుర్తింపు పొందారు. ఎప్పటిలా సూట్‌కేసులో కాకుండా రాజముద్ర ఉన్న ఎరుపు రంగు వస్త్రంలో బడ్జెట్ ప్రతులను తీసుకొచ్చే కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. కొవిడ్ సంక్షోభ సమయంలో పేద వర్గాల కోసం అనేక ఉపశమన పథకాలను ప్రవేశపెట్టారు. ఆమె హయాంలో అత్యంత వేగవంతమైన వృద్ధి నమోదు చేస్తున్న దేశంగా భారత్ కొనసాగుతోంది. మొరార్జీ దేశాయ్ అత్యధికంగా పదిసార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటి ఆర్థికశాఖ మంత్రి ఆర్.కె.షణ్ముగం చెట్టి తొలి బడ్జెట్‌ను పార్లమెంట్ ముందుకుతీసుకొచ్చారు.




పట్నా: లోక్‌సభ ఎన్నికలకు ముందు బిహార్ రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. సంకీర్ణ ప్రభుత్వంలో విభేదాల వేళ.. భాజపాతో మళ్లీ జట్టు కట్టాలని ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అదే నిజమైతే కేంద్రంలోని విపక్ష 'ఇండియా' కూటమికి గట్టి ఎదురుదెబ్బే. ఈ ఊహాగానాల వేళ కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ .. నీతీశ్‌కు ఫోన్ చేసినట్లు తెలుస్తోంది. అయితే ఆమెతో మాట్లాడేందుకు సీఎం విముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలోని 'భారత్ జోడో న్యాయ యాత్ర' ఈ నెల 30న బిహార్‌లో ప్రవేశించనుంది. ఈ యాత్రలో పాల్గొనాలని ఇప్పటికే హస్తం పార్టీ నీతీశ్‌ను ఆహ్వానించింది. దీని గురించి సోనియా గాంధీ శుక్రవారం ఆయనతో ఫోన్‌లో మాట్లాడేందుకు ప్రయత్నించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. కానీ, ఆ కాల్స్‌ను సీఎం పట్టించుకోలేదని పేర్కొన్నాయి. రాహుల్ యాత్రలో పాల్గొనకూడదని ఇప్పటికే ఆయన నిర్ణయించుకున్నట్లు సదరు వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో సంకీర్ణ కూటమి కూలిపోనుందనే ఊహాగానాలకు ఈ వార్తలు మరింత బలం చేకూర్చాయి.

**మాకు మెజార్టీ ఉంది: లాలూ –** కుటుంబ రాజకీయాలపై ఇటీవల నీతీశ్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో.. ఆర్జేడీ, కాంగ్రెస్‌తో జేడీయూ బంధం బీటలు వారింది. ఈ క్రమంలోనే భాజపా మద్దతుతో జేడీయూ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం రానుందని తెలుస్తోంది. ఆదివారమే సీఎం.. గవర్నర్‌ను కలవనున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీనిపై ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. "కూటమి నుంచి నీతీశ్ విడిపోతే మా తలుపులు తెరుస్తాం. మాకు మెజార్టీ ఉంది" అని ఆయన వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరించుకుంది. నీతీశ్‌ను మళ్లీ సీఎం కాకుండా అడ్డుకునేందుకు.. చిన్న పార్టీలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ఆర్జేడీ సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

**పోటాపోటీ సమావేశాలు..** రాష్ట్రంలో కీలక పరిణామాలు జరగనున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో భాజపా, కాంగ్రెస్, ఆర్జేడీ పోటాపోటీగా సమావేశాలు ఏర్పాటు చేశాయి. ఈ మధ్యాహ్నం డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ ఇంట్లో ఆర్జేడీ కీలక నేతలు సమావేశం కానున్నారు. అదే సమయంలో పూర్ణియాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భేటీ కానున్నారు. సాయంత్రం 4 గంటలకు భాజపా సమావేశం ఏర్పాటు చేసింది.

## రాష్ట్రంలో మరో కొత్త నాటకానికి తెరదీసిన జగన్



విశాఖ: జగన్ సర్కార్‌పై మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఎక్స్ వేదికగా ఫైర్ అయ్యారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ఒక నెల రోజుల సమయంలో డీఎస్సీ నోటిఫికేషన్ అంటూ రాష్ట్రంలో మరో కొత్త మోసానికి జగన్ తెర తీశారన్నారు. ఇప్పుడు నోటిఫికేషన్ ఇస్తే పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తారు..? ఎప్పుడు పోస్టులు భర్తీ చేస్తారు..? అని ప్రశ్నించారు. ఎన్నికలు సమయానికి ఈ ప్రక్రియ మొత్తం పూర్తి చేయగలరా..? ఎందుకు ఈ ఒట్టి వాగ్దానాలు..? అని గంటా నిలదీశారు. ఇలా నిరుద్యోగులను ఎన్ని రోజులని మభ్యపెడతారని ప్రశ్నించారు. ఒక ప్రణాళిక లేకుండా ఎన్నికల ముందు నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగుల్ని మోసం చేస్తున్నారన్నారు.

ఇదంతా ఎన్నికల జిమ్మిక్కు కాకా మరేమిటని జగన్‌ను గంటా నిలదీశారు. రాష్ట్రంలోని నిరుద్యోగులు అధైర్య పడాల్సిన అవసరం లేదని..భవిష్యత్తు మనదేనన్నారు. రేపు అధికారంలోకి రాబోతుంది తెలుగుదేశం ? జనసేన ప్రభుత్వమే రాబోతోందన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులన్నీ భర్తీ చేసి, మీ ఉద్యోగాలను మీకు ఇచ్చే బాధ్యత చంద్రబాబు తీసుకుంటారని గంటా తెలిపారు.

## శాసన మండలి నోటీసులపై.. ఎమ్మెల్సీ రామచంద్రయ్య రియాక్షన్ ఇదే..

అమరావతి: అప్రజాస్వామిక విధానాలు, నియంతృత్వ పోకడలు నచ్చకే వైసీపీకి రాజీనామా చేశానని ఎమ్మెల్సీ రామచంద్రయ్య అన్నారు. ఆయనకు శాసన మండలి శనివారం నాడు నోటీసులు పంపించింది. నోటీసులు పంపించడంపై రామచంద్రయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "పార్టీకు రాజీనామా చేయడంపై వివరణ ఇవ్వాలని ఈనెల 8వ తేదీన శాసన మండలి నుంచీ నాకు నోటీసులు అందాయి. నా సతీమణి ఆరోగ్య పరిస్థితి బాగోనందున, నోటీసులపై స్పందించడానికి నాలుగు వారాల వ్యవధి కావాలన్నాను. నాకు సమయం ఇవ్వకుండా, నా వివరణ కోరకుండా.. చర్యలకు ఉపక్రమించడం అన్యాయం.. రాజ్యాంగ విరుద్ధం. ఎమ్మెల్సీగా నేను వైసీపీకి విధేయుడినై ఉండాలా.. రాజ్యాంగానికి బద్ధుడినై ఉండాలా? ఈ ప్రభుత్వం, ముఖ్యమంత్రి పరిపాలనలో రాజ్యాంగబద్ధంగా



వ్యవహరిస్తున్నారా" అని ఎమ్మెల్సీ రామచంద్రయ్య మండిపడ్డారు.




# మీ సేవల్లో వాటికి దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్: రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నవారికి తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది.

ఇటీవలే 5 గ్యారంటీల అమలు కోసం ప్రజాపాలన దరఖాస్తులు తీసుకున్న సర్కార్.. తాజాగా రేషన్ కార్డుల కోసం మరోచోట దరఖాస్తులు స్వీకరిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మీ సేవ కేంద్రాల్లో ఫిబ్రవరి చివరి వారంలోపు వీటిని సమర్పించవచ్చు. బోగస్ రేషన్ కార్డుల నిర్మూలనలో భాగంగా ప్రభుత్వం ఈకేవైసీ చేపట్టింది. ఇది పూర్తి చేయడానికి జనవరి 31 వరకు గడువు పొడగిస్తూ పౌర సరఫరాల కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు.

తెలంగాణలో డిసెంబరు 28 నుంచి జనవరి 6 వరకు కొనసాగిన ప్రజాపాలనలో కూడా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించారు. సబ్సిడీ సిలిండర్ల కోసం మొత్తం 91.49 లక్షల మంది మహిళలు దరఖాస్తు చేసుకోగా, 92.23 లక్షల మంది మహిళలు ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు.




హైదరాబాద్: బోగస్ కార్డుల ఏరివేతకు చేపట్టిన రేషన్‌కార్డు కేవైసీ ప్రక్రియకు గడువు సమీపిస్తోంది. ఈ నెల 31 వరకు గడువు ఉండగా మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా మినహా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఈ రెండు జిల్లాల్లో కలిపి 20- 30శాతం మేర కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోలేదని అధికారులు తెలిపారు. మరణించినవారి పేర్లు, వివాహాలు చేసుకొని వెళ్లిపోయిన ఆడపిల్లల పేర్లు తొలగించకుండా బియ్యం కోటాను తీసుకుంటున్న దాఖలాలున్నాయి. ఈ నేపథ్యంలోనే గతేడాది సెప్టెంబరులో ప్రభుత్వం ఈ ప్రక్రియను ప్రారంభించింది. లబ్ధిదారుల వివరాలతో పాటు వేలిముద్రలను మరోసారి సేకరిస్తున్నారు. దూర ప్రాంతాల్లో ఉంటున్నవారు అక్కడి చౌకధరల దుకాణానికి వెళ్లి ప్రక్రియ పూర్తిచేసుకునే వెసులుబాటు కల్పించినట్టు అధికారులు తెలిపారు.

**బోగస్ డీలర్లకు చెక్..** ఈకేవైసీతోపాటు బోగస్ రేషన్ డీలర్లకు సంబంధించిన తనిఖీలు జరుగుతున్నాయని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పౌరసరఫరాల అధికారులు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఇద్దరిని గుర్తించినట్లు చెప్పారు.




హైదరాబాద్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు నగదుతో పాటు తులం బంగారం ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలపై సమీక్ష నిర్వహించిన సీఎం.. పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రంలోని ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటుపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ హాస్టళ్లకు గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించేందుకు స్థలాలు గుర్తించి, అంచనాలు తయారు చేయాలన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సమీక్షలో పాల్గొన్నారు.




హైదరాబాద్: ఆదాయానికి మించి అక్రమాస్తుల కేసులో హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు వెల్లడయ్యాయి. బాలకృష్ణ ఇల్లు సహా 18 చోట్ల ఏసీబీ ఇటీవల సోదాలు చేసి భారీగా స్థిర, చరాస్తులకు సంబంధించిన దస్త్రాలను గుర్తించింది. బాలకృష్ణ ఇంట్లో స్వాధీనం చేసుకున్న 50 స్థిర, చరాస్తులకు సంబంధించిన పత్రాలను పరిశీలించగా.. వాటి విలువ దాదాపు రూ.5 కోట్లు ఉంటుందని అంచనా. వాటితోపాటు సోదాల్లో రూ.99 లక్షల నగదు, నాలుగు కార్లు, రూ.8.26 కోట్ల విలువైన బంగారం, వెండి, వాచ్‌లు, ఫోన్లు, గృహోపకరణాలను సీజ్ చేసినట్లు రిమాండ్ రిపోర్టులో అధికారులు పేర్కొన్నారు. పలు ఇన్‌ఫ్రా కంపెనీల్లోనూ సోదాలు చేసినట్లు ఏసీబీ పేర్కొంది. “155 డాక్యుమెంట్ షీట్లు, 4 బ్యాంక్ పాస్‌బుక్‌లు స్వాధీనం చేసుకున్నాం. ఇందుకు సంబంధించి బినామీలను విచారించాలి. ఇతర అధికారుల పాత్రపై దర్యాప్తు జరపాల్సి ఉంది. పీర్జాదిగూడలో రమాదేవి, జూబ్లీహిల్స్‌లో ప్రమోద్ కుమార్, మాదాపూర్‌లో సందీప్ రెడ్డి, బాచుపల్లిలో సత్యనారాయణ మూర్తి ఇళ్లు సహా మొత్తం 18 చోట్ల సోదాలు చేశాం” అని రిమాండ్ రిపోర్టులో ఏసీబీ వివరించింది.

# ఒక్కో ఎమ్మెల్యేకు భాజపా రూ.25 కోట్ల ఆఫర్: కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు

దిల్లీ: ఆప్ కన్వీనర్, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్.. భాజపాపై సంచలన ఆరోపణలు చేశారు. తమ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రయత్నించిందన్నారు. ఒక్కొక్కరికి రూ.25 కోట్లు ఆశ చూపి, ఏడుగురు ఎమ్మెల్యేల కొనుగోలుకు కుట్ర పన్నిందని సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేశారు. “ఇటీవల వారు(భాజపా) ఏడుగురు దిల్లీ ఎమ్మెల్యేలను సంప్రదించారు. ‘కొద్ది రోజుల్లో కేజ్రీవాల్ అరెస్టు అవుతారు. ఎమ్మెల్యేలను విడగొట్టొచ్చు. 21 మందితో చర్చలు జరిపాం. మరికొంతమందితోను మాట్లాడాం. తర్వాత మేం ఆప్ ప్రభుత్వాన్ని కూల్చేస్తాం. మీరు కూడా రావొచ్చు. రూ.25 కోట్లు ఇస్తాం. భాజపా టికెట్‌పై ఎన్నికల్లో పోటీ చేయొచ్చు’ అని మా ఎమ్మెల్యేలతో మాట్లాడారు. నన్ను అరెస్టు చేసేది మద్యం కుంభకోణం కేసులో విచారించేందుకు కాదని దీనినిబట్టి అర్థమవుతోంది. మా ప్రభుత్వాన్ని కూల్చేందుకు వారు కుట్ర పన్నుతున్నారు. గత 9 ఏళ్లలో వారు ఇలాంటి ప్రయత్నాలు ఎన్నో చేసినా విజయం సాధించలేకపోయారు. ప్రజల మద్దతు ఎప్పుడూ మాకే. మా ఎమ్మెల్యేలు కలిసికట్టుగా ఉన్నారు. వారి ఆఫర్‌ను తిరస్కరించారు. ఈసారి కూడా వారి కుట్రలు భగ్నమవుతాయి” అని కేజ్రీవాల్ సుదీర్ఘ పోస్టు పెట్టారు. ఆప్ ప్రభుత్వం అందిస్తోన్న సుపరిపాలన వల్లే ఈ యత్నాలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి ఆరోపించారు. దిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆప్ అధినేతకు ఈడీ ఇప్పటికే పలుమార్లు నోటీసులు పంపింది. ఈ విచారణలో భాగంగానే ఆయన్ను అరెస్టు చేసే అవకాశాలున్నాయని ఆప్ నేతలు ఇప్పటికే అనేకసార్లు ఆందోళన వ్యక్తంచేశారు. దర్యాప్తు సంస్థ పంపే ఎలాంటి ప్రశ్నావళికైనా జవాబులు తెలపడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్తున్న కేజ్రీవాల్.. ఈడీ విచారణకు మాత్రం హాజరుకావడం లేదు. ఈ కేసులో తనను విచారించడానికి గల నిజమైన ఉద్దేశాన్ని తెలపాలంటూ ఇప్పటికే పలుమార్లు లేఖలు పంపారు.




**నిజామాబాద్ లోక్‌సభ స్థానం నుంచి భారాస తరపున ఎవరు పోటీ చేస్తారనే అంశం ఉత్కంఠ రేపుతోంది. కల్వకుంట్ల కవిత బరిలో ఉండరనే ఊహాగానాల నేపథ్యంలో.. టికెట్ కోసం పలువురు నేతలు ప్రయత్నిస్తున్నారు. అధిష్ఠానంతో సంప్రదింపులు ముమ్మరం చేశారు.**

# ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం.. డేట్ ఫిక్స్ చేసిన బీఆర్ఎస్ అధినేత..




హైదరాబాద్, జనవరి 27: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారైంది. ఫిబ్రవరి 1వ తేదీన ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు కేసీఆర్. తుంటి ఎముక శస్త్ర చికిత్స కారణంగా కేసీఆర్ ఇప్పటి వరకు ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయలేదు. ఇప్పుడు కాస్త కోలుకోవడంతో అసెంబ్లీకి వచ్చేందుకు సిద్ధమయ్యారు. ఫిబ్రవరి 1వ తేదీన మంచిరోజు కావడంతో.. అసెంబ్లీ స్పీకర్ చాంబర్‌లో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు కేసీఆర్. కాగా, ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్.. కామారెడ్డి, గజ్వేల్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన విషయం తెలిసిందే. అయితే, కామారెడ్డిలో అనూహ్యంగా ఆయన ఓటమిపాలయ్యారు. గజ్వేల్ నుంచి మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే, ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘోర పరాజయం చెందగా.. కాంగ్రెస్ విజయఢంకా మోగించింది. దీంతో తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయి.. కాంగ్రెస్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటైంది. ఓటమి నేపథ్యంలో నాటి సీఎం కేసీఆర్ తన రాజీనామా లేఖను నేరుగా గవర్నర్‌కు పంపించి.. అక్కడి నుంచి ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్‌కు వెళ్లారు.

ఈ క్రమంలో ఓ రోజు రాత్రి కేసీఆర్ ఇంట్లో కాలు జారి కింద పడ్డారు. ఈ ఘటనలో ఆయన తుంటి ఎముక విరిగిపోయింది. యశోద ఆస్పత్రిలో చేర్పించగా.. శస్త్రచికిత్స చేసి తుంటి ఎముక రీప్లేస్ చేశారు. 8 వారాలు రెస్ట్ తీసుకోవాలని వైద్యులు సూచించగా.. కేసీఆర్ బెడ్ రెస్ట్‌లో ఉన్నారు. ఇప్పుడు కాస్త కోలుకోవడంతో ప్రజా క్షేత్రంలోకి వచ్చేందుకు సిద్ధమయ్యారు. త్వరలోనే పార్లమెంట్ ఎన్నికలు కూడా ఉండటంతో.. ఎన్నికల కథన రంగంలోకి దూకేందుకు సిద్ధమయ్యారు కేసీఆర్. ఈ క్రమంలోనే ముందుగా ఆయన ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

# కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కారణమిదే.. హరీశ రావు సంచలన వ్యాఖ్యలు



సిద్దిపేట: అబద్దాల ప్రచారంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. శనివారం నాడు సిద్దిపేట కొండా మల్లయ్య గార్డెన్‌లో బీఆర్ఎస్ కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సభలో జెడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ... ప్రజల తీర్పు శిరసావహించాలని.. నాడు పది సీట్లు వచ్చినా తాము వెనకడుగు వేయలేదని చెప్పారు. 1.8 % ఓట్లతో అధికారం కోల్పోయామని చెప్పారు. దళిత, బీసీ బంధుతో ఓట్లు తగ్గాయన్నారు. కాంగ్రెస్ తీరు అనాడు ప్రచారంలో.. అబద్దాలు, నేడు పాలనలో అసహనం పెరిగిపోయిందని మండిపడ్డారు. యూట్యూబ్ చానెళ్లు కూడా సగం మన కొంప ముంచాయన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఏ హామీను నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. రూ. 2 లక్షల రుణమాఫీ, వడ్లకు 5 వేల బోనస్, 4 వేల రూపాయల పింఛన్, కరెంట్ బిల్లుల మాఫీ వంటి హామీలు అమలు చేశారా ? అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నవాళ్లకు ఓపిక ఉండాలని.. ప్రశ్నిస్తే దాడులు చేస్తారా ? అని హరీశ్ రావు నిలదీశారు.

**అప్పుల పేరుతో.. కాంగ్రెస్ కాలం వెళ్లదీత :** బీఆర్ఎస్‌కు ఉద్యమాలు, దాడులు, బెదిరింపులు కొత్తకాదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎలా ఎగ్గొట్టాలనే ఆలోచిస్తోందని.. అందుకే అప్పుల పేరుతో కాలం వెళ్లదీస్తోందని ఆరోపించారు. ఫిబ్రవరి రెండో వారంలో పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని అంటున్నారని.. ఈ లోగా కాంగ్రెస్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన మహిళలు 1.50 కోట్ల మంది ఉన్నారని.. వారందరికీ వెంటనే 2,500 రూపాయలు ఇవ్వాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఒక్క ఎకరం కూడా నీరుపారడం లేదన్నారు.. మరి మొన్న మంత్రి కొండా సురేఖ రంగనాయకసాగర్ గేట్లు ఎందుకు వదిలారని ప్రశ్నించారు. రైతులకు 24 గంటలు కరెంట్ రావట్లేదని చెప్పారు. ఎరువుల కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడేది కాంగ్రెస్, బీజేపీలు కావని.. బీఆర్ఎస్ మాత్రమేనని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ స్థానాలను ఎక్కువగా గెలిస్తేనే... కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై నిలదీసేందుకు అవకాశం ఉంటుందని హరీశ్ రావు అన్నారు.




భద్రాచలం, కొండగట్టు: భద్రాద్రి రామయ్య సన్నిధిలో భక్తుల రద్దీ పెరిగింది. వరుస సెలవులు రావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఇవాళ లక్ష్మణ సమేత సీతారాములకు ఆలయ అర్చకులు బంగారు తులసీదళాలతో అర్చన చేశారు. రద్దీ నెలకొనడంతో నిత్య కల్యాణ వేడుకను.. చిత్రకూట మండపంలో నిర్వహిస్తున్నారు. ఉచిత దర్శనానికి 3 గంటలు, ప్రత్యేక దర్శనానికి రెండు గంటల సమయం పడుతోంది. జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్న ఆలయానికీ భక్తులు పోటెత్తారు.

శనివారం, మేడారం జాతర సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో క్యూలైన్‌లు నిండి వెలుపల వరకు బారులు తీరారు. వందలాది వాహనాలతో ఘాటు రోడ్డు, ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి.

# ఎమ్మెల్సీలుగా కోదండరాం, మీర్ అమీర్ అలీఖాన్.. అధికారిక ఉత్తర్వులు జారీ

హైదరాబాద్: గవర్నర్ కోటాలో ఇద్దరు ఎమ్మెల్సీలను తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అమోదించారు. తెలంగాణ జన సమితి వ్యవస్థాపకుడు, ప్రొఫెసర్ కోదండరాం, మీర్ అమీర్ అలీఖాన్‌లను ఎమ్మెల్సీలుగా నియమించారు. వీరిద్దర్ని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన ప్రొఫెసర్ కోదండరామ్, సియాసత్ పత్రిక రెసిడెంట్ ఎడిటర్ జావెద్ అలీఖాన్ కుమారుడు మీర్ అమీర్ అలీఖాన్‌లను ఎమ్మెల్సీలుగా ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే ఈ రెండు ఎమ్మెల్సీ పోస్టులు ఎప్పటి నుంచో ఖాళీగా ఉన్నాయి. బీఆర్ఎస్ మొదట వీటి భర్తీ కోసం దాసోజు శ్రవణ్, కె.సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించింది. ఈ ఫైలును గవర్నర్‌కు పంపించగా ఆమె తిరస్కరించిన విషయం తెలిసిందే.



Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com